శనివారం
18-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 117
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చైనాలో తగ్గుతున్న జనాభా

బీజింగ్: వరుసగా మూడో సంవత్సరం చైనా జనాభా తగ్గింది. 2024 సంవత్సరం చివరి నాటికి చైనాలో 140.8 కోట్ల జనాభా ఉంది. అంతక్రితం ఏడాది (2023)తో పోలిస్తే 13.90 లక్షల మేర జనాభా తగ్గిపోయింది. ఈ గణాంకాలను స్వయంగా చైనా ప్రభుత్వమే శుక్రవారం ఉదయం విడుదల చేసింది. చైనాలో జనాభా తగ్గుదలకు కారణం జనన రేటు తగ్గడమే కారణమని అక్కడి ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ నివేదిక ప్రకారం.. చైనాలో వృద్ధుల జనాభా పెరుగుతుండగా.. పని చేసే యువ జనాభా సంఖ్య తగ్గుతూ వస్తోంది. మరో వైపు జనన రేటు మాత్రం పెరుగడం లేదు. జనాభా తగ్గుతున్న క్రమంలో చైనా ప్రభుత్వం జనాభాను పెంచేందుకు 2021 మేలో గతంలో విధించిన ఆంక్షలు ఎత్తివేసింది.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఖరారయ్యారు. రెండు విడతలుగా జరిగే ఈ సమావేశాల్లో తొలి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు, రెండో విడత సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయి. పార్లమెంటు సమావేశాల షెడ్యూల్ ప్రకారం, ఈనెల 31న పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సమావేశాలు ప్రారంభవుతాయి. ఫిబ్రవరి 1న 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

- మిగతా 2 లో

కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ ఓకే

జెరూసలెం: ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందానికి ఇజ్రాయిల్ సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని సిఫార్సు చేసినట్లు ప్రధాని నెతన్యాహు కార్యాలయం వెల్లడించింది. తాజా పురోగతి నేపథ్యంలో ఆదివారం నుంచి ఈ ఒప్పందం అమలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'అన్ని రాజకీయ, భద్రతాపరమైన, మానవతా అంశాలను సమీక్షించి, యుద్ధం లక్ష్యాలు సాధించడానికి ఇది

- మిగతా 2 లో

విదేశీమారక నిల్వల భారీ పతనం

న్యూఢిల్లీ: భారత విదేశీమారక (ఫారెక్స్) నిల్వలు భారీగా తగ్గాయి. ఈ నెల పదో తేదీతో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వు నిల్వలు 8.714 బిలియన్ డాలర్లు పతనమై 625.871 బిలియన్ డాలర్లకు పడిపోయాయని ఆర్బీఐ శుక్రవారం తెలిపింది.
ఈ నెల మూడో తేదీతో ముగిసిన వారంలోనూ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 5.693 బిలియన్ డాలర్లు పతనమై 634.585 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ వెల్లడించింది. గత కొన్ని వారాలుగా ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు తగ్గుతూ వస్తున్నయి.

ఇదీ లోకం!

మా ఆవిడ ఉచిత బస్సు వేసాక తిరిగి ఊరెళదాం అందిగానీ, అన్నాళ్లు పనులు చేసుకోకుండా ఉండలేం కదండీ!



విశాఖ ఉక్కుకు దన్ను

ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు రూ.11,440 కోట్లు

- తక్షణమే ప్యాకేజీ అమల్లోకి
- త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ప్రారంభం
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన

న్యూఢిల్లీ: విశాఖ ఉక్కును ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించి పునరుజ్జీవింప చేయడానికి రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందించనున్నట్లు కేంద్రప్రభుత్వం తెలిపింది. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. సదరు ప్యాకేజీకి గురువారమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు."ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు...పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి. ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్‌ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు" అని అశ్వినీవైష్ణవ్ ఆ ప్రకటనలో వివరించారు.

సమస్యల పరిష్కారానికి అడుగులు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖ ఉక్కుకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు దిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. సీఎం

- మిగతా 2 లో

నైపుణ్యాభివృద్ధికి పరస్పర సహకారం

ఐటీఈతో స్కిల్ వర్సిటీ ఎంఓయూ
రేవంత్ బృందం సింగపూర్ పర్యటన

విశాలాంధ్ర - హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన తొలిరోజునే విశేష స్పందన లభించింది. తెలంగాణ రైజింగ్ బృందం శుక్రవారం సింగపూర్‌లో పర్యటించింది. సీఎంతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్దన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్‌వీ ఎస్‌ఎస్ సుబ్బారావు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్‌ను సందర్శించారు. అక్కడి స్కిల్‌డెవలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించారు. శిక్షణనిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో చర్చలు జరిపారు. హైదరాబాదు ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. యువతకు ఉపాధి కల్పించేందుకు వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి శిక్షణలో సహకారం అందించాలని కోరారు. ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందిస్తూ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై వర్సిటీ వీసీ సుబ్బారావు, సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం తరఫున అకడమిక్ అండ్ అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్ సింగ్, ఐటీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ సంతకాలు చేశారు. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్ సందర్శించనుంది.

నిందితులను పట్టుకుంటాం

10 బృందాలతో గాలింపు ముమ్మరం
ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

విశాలాంధ్ర - హైదరాబాద్: బీదర్, అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బీదర్‌లో కాల్పులు జరిపింది బీహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా గుర్తించారు. వారం క్రితం చత్తీస్‌గఢ్‌లో దోపిడీకి పాల్పడిన బీహార్ ముఠా... హైదరాబాద్ నుంచి రాయ్‌పూర్, అక్కడ నుంచి బీహార్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బీదర్‌లో రెండు రోజులు రెక్కీ నిర్వహించి మరీ ఈ ముఠా దోపిడీ చేసింది. అనంతరం నగదును

- మిగతా 2 లో

మావోయిస్టులకు
దెబ్బ మీద దెబ్బ

ఎన్‌కౌంటర్‌లో 16కు పెరిగిన మృతులు
భారీగా ఆయుధాల స్వాధీనం

విశాలాంధ్ర- చింతూరు: మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల కాలంలో ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు పెద్దసంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణాల సంఖ్య 16కు పెరిగింది. గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎన్‌కౌంటర్‌లో ముందుగా నలుగురు చనిపోగా... ఆ తరువాత మృతుల సంఖ్య 12కు పెరిగింది. శుక్రవారం ఉదయం వరకు మొత్తం 16 మంది మావోయిస్టులు మృతి చెందారు. తెలంగాణ సరిహద్దు బీజాపూర్‌లోని మరూర్ బాకా, పూజారి కంకేర్ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి.

ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మృతి చెందినట్లుగా భద్రతా బలగాలు వెల్లడించాయి. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుండి ఎస్ఎల్ఆర్, బీజీసీ, ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొనేందుకు బీజాపూర్,

- మిగతా 2 లో

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు
సకాలంలో ఖర్చు చేయండి

- శాఖల వారీగా ప్రతినెలా వివరాలు వెల్లడించాలి
- మూసీ నిర్వాసితులకు వడ్డీలేని రుణాలు
- ఉన్నతాధికారుల సమీక్షలో భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సకాలంలో ఖర్చు చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ఖర్చు వివరాలను నెల రోజులకు ఒకసారి వెల్లడించాలని ఆదేశించారు. నిధులను సంపూర్ణ స్థాయిలో వినియోగిస్తూ ఆయా వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పూర్తి వివరాలతో ఈనెల 23న నిర్వహించబోయే సమావేశానికి హాజరుకావాలని కోరారు. రాబోయే రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎటువంటి వ్యూహాన్ని అనుసరిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. బడ్జెట్ యేతర నిధులు ఖర్చు సమయంలోను ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం జనాభా దామాషా లో నిధుల ఖర్చు జరిగిందా లేదా... అందుకు సంబంధించిన సంపూర్ణ సమాచారం అందించాలని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసిన సెస్ నివేదికను సంబంధిత అధికారులు అందజేశారు. సాధించిన ఫలితాలపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఇకనుంచి సెస్ అధికారులు తమ నివేదికలను ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ అధికారులకు అందజేసి వారితో తరచూ సమావేశం కావాలని సూచించారు. అటవీ భూముల్లో సోలార్ పవర్ ద్వారా మోటార్లు వినియోగించడం, ఆయా భూముల్లో వెదురు, అవకాడో, పామాయిల్ వంటి వాటితోపాటు అంతర పంటల సాగు ప్రాజెక్టులు డిజైన్ చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులను

అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అడవులను సంరక్షించడంతోపాటు ఆదివాసి, గిరిజన రైతులకు ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. మూసీ పునర్జీవనంలో నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించి వారికి వడ్డీ లేని రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పథకాలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు ఆయా వర్గాలకు అందించాలని

- మిగతా 2 లో

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరిలో సీపీఐ

ఆరు స్థానాల్లో పోటీ

న్యూఢిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పోటీ చేయనుంది. మొత్తం ఆరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలపనున్నట్లు సీపీఐ వెల్లడించింది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. దిల్లీ ఉత్తర జిల్లా ఆదర్శనగర్ నియోజకవర్గం నుంచి సంజీవ్‌కుమార్ రాణా, వాజీపూర్ నుంచి దేవేంద్రకుమార్, దిల్లీ పశ్చిమ జిల్లా వికాస్‌పురి నియోజకవర్గం నుంచి షీజో వర్ఘీస్, దిల్లీ నైరుతి జిల్లా పాలం నియోజకవర్గం నుంచి దిలీప్‌కుమార్, దిల్లీ దక్షిణ జిల్లా మెహ్రౌలీ నియోజకవర్గం నుంచి ఎర్షద్‌ఖాన్, ఓఖ్లా నుంచి ఎండి.ఇంజమాముల్ హసన్ పోటీ చేయనున్నట్లు వివరించింది. వీరంతా ఇప్పటికే తమ నామినేషన్లు దాఖలు చేశారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 5వ తేదీన ఒకే విడతలో జరుగుతుంది. మొత్తం 70 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఫిబ్రవరి 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

పేదలందరికీ ఇళ్లస్థలాలు

- గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు
- గతంలో సెంటు తీసుకోని వారికీ స్థలం
- ఏపీ కేబినెట్ నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద త్వరలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఎన్నికల హామీల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లతో పట్టాలు పంపిణీ చేయాలని తీర్మానించింది. ఇందుకోసం మార్గదర్శకాలు జారీ చేయడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం దాదాపు మూడు గంటలపాటు వివిధ అంశాలపై చర్చించి, కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిలో ఇళ్ల స్థలాల పంపిణీతో పాటు అభ్యంతరం లేని పేదల ఆక్రమిత నివాసగృహాలను క్రమబద్ధీకరించాలని, గ్రామ సచివాలయ వ్యవస్థను మూడు కేటగిరీలుగా విభజించాలని, నిషేధిత భూముల అంశంపై మంత్రుల కమిటీ ఏర్పాటు తదితర అంశాలున్నాయి. మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను సమాచార, గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. ఇళ్ల స్థలాల

- మిగతా 2 లో

'జేఈఈ' గందరగోళం

- ఏపీ విద్యార్థులకు లడ్డాఖ్‌లో పరీక్ష కేంద్రాలు
- పేపర్-1, 2కు వేర్వేరు ప్రాంతాల్లో కేటాయింపు
- ఎన్టీఏకి విన్నవించినా స్పందన కరువు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలోని ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో బీటెక్, బీఆర్క్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఇంజినీరింగ్ ఎగ్జామినేషన్ (జేఈఈ) పరీక్షా కేంద్రాల కేటాయింపు రాష్ట్రంలో గందరగోళంగా మారింది. ఏటా రెండు సెషన్లుగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ద్వారా కేంద్ర ఉన్నత విద్యాశాఖ జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తోంది. జేఈఈ పరీక్షలు సెషన్-1ను దేశ వ్యాప్తంగా ఈనెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి. సెషన్-2 ఏప్రిల్1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు ఏటా తెలుగు రాష్ట్రాల నుంచి లక్షన్నరకు ముందికిపైగా

- మిగతా 2 లో

తెలంగాణాలో
సీపీఐ ఆవిర్భావం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956లో ఏర్పడే దాకా తెలుగు మాట్లాడే ప్రజలు భిన్న రాజకీయ వ్యవస్థల్లో భాగంగా ఉన్నారు. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేవి. మరో వేపు తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రజలు నిజాం ఏలుబడిలో ఉండేవారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

విడాకుల ప్రచారం నిరాధారం

మిషెల్ బృందం వివరణ

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతుల విడాకులపై పెద్దఎత్తున ప్రచారం జరిగింది. దీనిపై ఒబామా భార్య మిషెల్ బృందం స్పందించింది. వారి వైవాహిక జీవితంపై నిరాధార వార్తలు వ్యాప్తి చేయొద్దని కోరింది. ఒబామా దంపతులు విడాకులు తీసుకుంటున్నారనే వార్తల్లో నిజం లేదని వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హాజరవుతున్నారని తెలిపింది. అయితే, ట్రంప్ వ్యవహార శైలి, గతంలో ఒబామా కుటుంబాన్ని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, జాతి ఆధారంగా చేసే విమర్శలు... మిషెల్ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. అందువల్లే ఆ కార్యక్రమానికి ఆమె దూరంగా ఉంటున్నారని ఆ బృందం వెల్లడించింది. ట్రంప్ వ్యాఖ్యలను మిషెల్ తీవ్రంగా పరిగణించారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆయనను తాను ఎప్పటికీ క్షమించనని తెలిపినట్లు పేర్కొన్నాయి. ఇటీవల అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియలు జరిగిన సమయంలో ఆమె మరో ప్రాంతంలో ఉన్నందువల్ల ఆ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని తెలిపింది. మిషెల్‌తో పాటు మాజీ స్పీకర్ నాన్సీ పెలోసి, కాంగ్రెస్ నేత అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్ వంటి ఇతర ప్రముఖులు కూడా ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవానికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. కొంతకాలంగా వివిధ కార్యక్రమాలకు మిషెల్ లేకుండా బరాక్ ఒబామా ఒంటరిగా హాజరవుతుండటంతో వారి మధ్య మనస్పర్థలు వచ్చినట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. ఇటీవల జరిగిన అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియల కార్యక్రమానికి కూడా మిషెల్ హాజరుకాకపోవడం, ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె దూరంగా ఉంటున్నారని వార్తలు రావడంతో ఒబామా దంపతులకు విడాకులు ఖాయమైనట్లు సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి.

ఇమ్రాన్‌ఖాన్‌కు 14 ఏళ్ల జైలు

ఆయన భార్యకు ఏడేళ్లు శిక్ష

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు. ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా... ఆమెకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు. ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను పాక్‌కు బ్రిటన్ పంపగా... ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం. దీనికి బదులుగా ఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆగస్టు 2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనపై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల తనపై ఉన్న జైలు శిక్ష సస్పెండ్ కావడంతో బుష్రాబీబీ బయటే ఉన్నారు.

క్రిప్టో కరెన్సీకి ట్రంప్ బాసట

వాషింగ్టన్: అమెరికా తదుపరి అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ జోరు పెరిగింది. క్రిప్టోకరెన్సీకి అనుకూలంగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు ఉండొచ్చన్న అంచనాలతో దీని విలువ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. అమెరికా జాతీయ ప్రాధాన్యత అంశంగా క్రిప్టో కరెన్సీని మార్చేదిశగా ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రిప్టోపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ కథనం పేర్కొంది. క్రిప్టో రంగానికి సంబంధించిన విధివిధానాల నిమిత్తం క్రిప్టో కరెన్సీ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి... రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు క్రిప్టో పరిశ్రమ నుంచి భారీ మద్దతు లభించింది. ఆయన పదవీ స్వీకార సమయంలో వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాల నిర్వహణ నిధికి ఆ సంస్థల నుంచి నిధులు అందాయి. కొత్త ప్రభుత్వంతో సంబంధాలు చాటుకునేలా వాషింగ్టన్‌లో 'ఇనాగరల్ క్రిప్టో బాల్' పేరిట శుక్రవారం ఒక కార్యక్రమం నిర్వహించాయి. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో క్రిప్టో రంగం తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంది. అయితే ట్రంప్ తీసుకువస్తారని భావిస్తోన్న ఉత్తర్వుల్లో అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు డిజిటల్ ఆస్తులకు సంబంధించిన తమ విధానాలను సమీక్షించుకునేలా ఆదేశాలు ఉండొచ్చని ఆ కథనం పేర్కొంది. ఆ సంస్థలపై కొనసాగుతోన్న వ్యాజ్యాలను నిలిపివేయడంపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ చర్యలు అమలైతే ట్రంప్ హయాంలో క్రిప్టో రంగం దూసుకెళ్లనుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. క్రిప్టో కరెన్సీకి ట్రంప్ సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ మద్దతు ఉన్న విషయం విదితమే.

శాశ్వత పరిష్కారం అవసరం: నారాయణ

విశాలాంధ్రబ్యూరో - విజయవాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కేంద్రం సాయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ తెలిపారు. అయితే, స్టీల్ ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం అవసరమని పేర్కొన్నారు. అందుకుగాను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాల్సి ఉందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను స్వయం సిద్ధం చేయడం ద్వారా భవిష్యత్‌లో ప్రైవేటీకరణ ఆలోచన ఉండదని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం, రాష్ట్రం స్వచ్ఛందంగా ఇవ్వలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు పోరాడి సాధించుకున్నారని, ఇందుకోసం ప్రాణత్యాగాలు చేశారని నారాయణ గుర్తుచేశారు. తెలుగు ప్రజల రక్తతర్పణ ద్వారా సాధించుకున్నారని,. దీనిని తెలుగు ప్రజల వారసత్వ సంపదగా పరిగణించాలని నారాయణ హితవు పలికారు.

సెయిల్‌లో విలీనంతోనే రక్షణ: రామకృష్ణ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించి... సెయిల్‌లో విలీనం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, వామపక్ష పార్టీలతోసహా ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజలు నాలుగేళ్లుగా పెద్దఎత్తున ఉద్యమం చేస్తున్నారని గుర్తుచేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం స్పందించిందని, విశాఖ స్టీల్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రకటించిందని, అందులో రూ.10,300 కోట్లు బాండ్ల రిడింప్షన్ కింద ఇస్తామని తెలిపిందన్నారు. ఇదే వాస్తవమైతే దీనివల్ల సమస్య పరిష్కారం అవుతుందని కార్మిక నేతలు భావించడం తగదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా ఉండాలంటే సొంత గనులు కేటాయించి... స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని స్టీల్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి రూ.17 వేల కోట్లు అప్పులున్నాయని చెబుతున్న ప్రభుత్వం... కేవలం రూ.11,440 కోట్లు కేటాయించడం వల్ల సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు క్యాపిటివ్ మైన్స్ కేటాయించకుండా... అనకాపల్లిలో దాదాపు రూ.70 వేల కోట్లతో మిత్తల్ ఏర్పాటుచేసే ప్రైవేటు పరిశ్రమకు క్యాప్టివ్ మైన్స్ కేటాయిస్తే విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆగదన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

జర్మనీలో వైభవంగా ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్

బెర్లిన్: బెర్లిన్‌లోని భారత రాయబార కార్యాలయం, ఠాగూర్ సెంటర్ సహకారంతో జర్మనీలో జనవరి 10 నుంచి 12 వరకు ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించింది. ఈ ఎడిషన్‌లో ఫ్రాంక్ ఫర్ట్, హాంబర్గ్, మ్యూనిచ్, బెర్లిన్ సహా అనేక నగరాల్లో ప్రేక్షకులను ఆకర్షించి, 10కి పైగా భాషలలో 20కి పైగా చిత్రాలను ప్రదర్శించింది. బెర్లిన్‌లో జరిగిన గాలా సాయంత్రం ప్రారంభమైన మెహతా బాయ్స్ ప్రీమియర్‌తో ఫెస్టివల్ ఆహ్లాదకరంగా సాగింది. శేఖర్ కపూర్, బొమన్ ఇరానీ, అపర్శక్తి ఖురానా, పూజా సరూప్, అవినాశ్ తివారీ, రాహుల్ చిట్టెల్లా, కాను బెహల్, లక్ష్మీప్రియ దేవి, అతుల్ సబర్వాల్ వంటి ప్రముఖ దర్శకులు, నటులు, దర్శకనిర్మాతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ అవార్డు గ్రహీత గుల్ మొహర్, మనోజ్ బాజ్‌పాయ్ నటించిన డిస్పాచ్ చిత్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. అంబాసిడర్ అజిత్ గుప్తే, ప్రీతి గుప్తే భారత్, జర్మన్ ప్రముఖులను ఈ గ్రాండ్ ఈవెంట్‌కు ఆహ్వానించారు. బెర్లిన్‌లోని పోట్స్ డామర్ ప్లాట్జ్ వద్ద సినీమాక్స్ ఎక్స్‌తో సహా అత్యాధునిక వేదికలపై ప్రదర్శనలు జరిగాయి. ఫెస్టివల్ ముఖ్యాంశాలలో పోస్ట్ స్క్రీనింగ్ ప్రశ్నోత్తరాల సెషన్లు ఉన్నాయి. బెర్లిన్‌లోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో తమ ఉత్సాహాన్ని పంచుకుంది, 'ఐఐఎఫ్ జర్మనీకి అద్భుతమైన స్పందన లభించింది. 5,000 వీక్షకులు ప్రదర్శనలకు హాజరయ్యారు.

ముగింపు చిత్రం 'గుల్ మొహర్' ప్రదర్శనలతో పాటు 'ది సబర్మతి రిపోర్ట్', 'మసూమ్' ప్రదర్శనలతో ఫెస్టివల్ ముగిసింది. 'గుల్ మొహర్' దర్శకుడు రాహుల్ చిట్టెల్ల, సీనియర్ శేఖర్ కపూర్‌తో కూడా ప్రేక్షకులు ఆహ్లాదకరమైన ప్రశ్నోత్తరాల సెషన్లు జరిపారు.

కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ ఓకే

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోజనకరమని అర్థం చేసుకున్న తర్వాత... ఈ ప్రతిపాదిత ఒప్పందానికి ఆమోదించాలని సెక్యూరిటీ కేబినెట్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది' అని ప్రధాని కార్యాలయం పేర్కొంది. ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపేందుకు పూర్తిస్థాయి కేబినెట్ కూడా తక్షణమే సమావేశమవుతుందని తెలిపింది. అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పంద ప్రక్రియ కొనసాగుతోంది. దీని ప్రకారం... బందీల విడుదలకు ప్రతిగా పలస్తీనా ఖైదీలను ఇజ్రాయిల్ విడిచిపెట్టనుంది. తర్వాత పూర్తిస్థాయిలో యుద్ధాన్ని ముగించే దిశగా చర్యలు తీసుకోనున్నారు. ఇక ఈ ఒప్పందానికి సంబంధించి బందీల కుటుంబాలకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.

సకాలంలో ఖర్చు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఇందిర జల ప్రభ, మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీ రైతులకు ఆర్థిక చేయూత అందించాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలతో ఎస్సీ, ఎస్టీ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు సమావేశమై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్ రాజ్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్టి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్ పాల్గొన్నారు.

ఆరుగుర్ని చంపిన జంటకు మరణ శిక్ష

లక్నో: భార్యాభర్తలు కలిసి కుటుంబంలోని ఆరుగురు సభ్యులను హత్య చేశారు. ఐదేళ్ల నాటి ఈ కేసుపై విచారణ జరిపిన కోర్టు... ఆ జంటను దోషులుగా నిర్ధారించడంతోపాటు వారికి మరణ శిక్ష విధించింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. 2020లో అజయ్ సింగ్ తన భార్య రూపా సింగ్‌తో కలిసి దారుణానికి పాల్పడ్డాడు. తండ్రి అమర్ సింగ్, తల్లి రామ్ దులారి, సోదరుడు అరుణ్ సింగ్, వదిన రామ్ సఖి, వారి పిల్లలైన సౌరభ్, సారికలను కాల్చి చంపారు. దీనిపై అజయ్ సింగ్ సోదరి దుర్గావతి అలియాస్ గుడ్డీ సింగ్, లక్నోలోని బంత్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోదరుడు అజయ్ సింగ్ తమ తండ్రి నుంచి డబ్బులు డిమాండ్ చేసేవాడని తెలిపింది.

భూమిని అమ్మిన డబ్బు మొత్తం అన్నా, వదినలకు తండ్రి ఇస్తాడేమోనని ఆందోళన చెందేవాడని చెప్పింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, అన్నావదినలు, వారి పిల్లలను హత్య చేశారని ఆరోపించింది. అజయ్ సింగ్, అతడి భార్య రూపా సింగ్, వారి మైనర్ కుమారుడు కలిసి దీనికి కుట్రపన్నినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మరోవైపు కుటుంబంలోని ఆరుగురు వ్యక్తుల హత్యలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులైన అజయ్ సింగ్, అతడి భార్య రూపా సింగ్‌ను అరెస్ట్ చేశారు. ఎనిమిది మంది సాక్షులను ప్రాసిక్యూషన్ విచారించింది. 31 డాక్యుమెంటరీ ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దీంతో గత ఏడాది డిసెంబర్ 16న భార్యాభర్తలైన అజయ్ సింగ్, అతడి భార్య రూపా సింగ్‌ను దోషులుగా లక్నో కోర్టు నిర్ధారించింది. శుక్రవారం శిక్షలు ఖరారు చేసిన కోర్టు ఆ జంటకు మరణ శిక్ష విధించింది.

పేదలందరికీ ఇళ్లస్థలాలు

(మొదటిపేజీ తరువాయి)

మంజూరుకు సంబంధించిన పథకానికి బీపీఎల్ కుటుంబాల వారంతా అర్హులేనని మంత్రి తెలిపారు. అయితే ఇంతకుముందు ఏ ప్రభుత్వంలోనూ గృహ నిర్మాణ పథకం కింద గృహ నిర్మాణ రుణం పొంది ఉండకూడదని, తప్పనిసరిగా లబ్ధిదారుడు ఆధార్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మెట్ట ప్రాంతంలో ఐదు ఎకరాలు, మాగాణి 2.50 ఎకరాలకు మించి ఉండ కూడదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో చాలామందికి ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోని వారికి, ఆ కేటాయింపులు అన్నింటినీ రద్దు చేసి తిరిగి ఈ పథకం కింద ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామ/వార్డుస్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్సును మరింత సమర్థవంతంగా అమలు చేయడం, స్వర్ణాంధ్ర విజన్-2047ని సాధించడం కోసం గ్రామ/వార్డు సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 11,162 గ్రామ సచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి... 11 మందిని గ్రామ సచివాలయంలో, 10 మందిని వార్డు సచివాలయాల్లో ఉద్యోగులుగా నియమించింది. ఎటువంటి ఆలోచన, ముందుచూపు లేకుండా ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థలు ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించడం లేదనే అభిప్రాయంతో... ఇకపై 3,501 జనాభాకు పైబడి ఉన్న సచివాలయాన్ని ఏ కేటగిరీగా విభజించి... వారికి 8 మంది ఉద్యోగులను, 2,501 నుండి 3,500 వరకూ జనాభా ఉన్న సచివాలయాన్ని బి కేటగిరీగా విభజించి ఏడుగురిని, 2,500 జనాభా లోపు ఉన్న సచివాలయాన్ని సి కేటగిరీగా విభజించి ఆరుగురు ఉద్యోగులను కేటాయించనున్నట్లు మంత్రి వివరించారు.

గ్రామ సచివాలయాల ఉద్యోగులకు పంచాయతీ సెక్రటరీ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు వార్డు ఎడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ హెడ్‌గా ఉంటారు. అదనంగా ఉన్న ఉద్యోగులను వారి అర్హతకు తగ్గట్టుగా ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తారు. ఈ విధానాన్ని పర్యవేక్షించేందుకు మంత్రులు, జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తారు. మంత్రివర్గం తీసుకొన్న మరికొన్ని నిర్ణయాలివే...

- రాష్ట్రంలో ఆక్రమణకు గురైన అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాలలో అర్హులైన నిరుపేదలు 2019 అక్టోబరు 15 నాటికి నిర్మించుకున్న నివాస గృహాలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం తీర్మానం
- ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యకలాపాలు కొనసాగించేందుకు అవసరమైన నిధులను జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుండి ఏపీ స్టేట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ అదనపు రుణ సౌకర్యంగా రూ.700 కోట్ల మేర రుణం పొందేందుకు ప్రభుత్వ హామీ.
- ఈ సీజన్‌లో 28,083,238 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ, రూ.6,469 కోట్ల చెల్లింపులు పూర్తి, ఇంకా కొంత ధాన్యం సేకరించాలని నిర్ణయం
- ఫెర్రో అల్లాయ్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అభ్యర్థనపై విద్యుత్ సుంకంలో అదే తగ్గింపును కొనసాగించేందుకు మంత్రి మండలి ఆమోదం, దీనిమూలంగా దాదాపు రూ.300 కోట్ల మేర అదనపు భారం పడినప్పటికీ దీనిలో పనిచేస్తున్న 40 వేల ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం.
- వివిధ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో 62 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మరో 63 అన్నా క్యాంటీన్‌ల ఏర్పాటు. ఈ క్యాంటీన్ల నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేకంగా సొసైటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం.
- నాగావళి నదిపై సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు ఎడమవైపు 1.0, కుడి వైపున 2.7 మెగావాట్ల జల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం.
- తాడేపల్లి గ్రామ పరిధిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానదికి కుడివైపున రూ.294 కోట్ల వ్యయంతో రక్షణ గోడ నిర్మాణం.
- ఫ్రీహోల్డ్ భూములు,1908లోని నిషేధిత ఆస్తుల జాబితా 22-ఏ(1) ఏ నుండి ఈ వరకు ఉన్న భూముల తొలగింపు, 1908 లోని 22-ఏ(1)(బి)లోని బీఎస్ఓ (24) జాబితాలో బదిలీ చేయబడిన భూముల తొలగింపు అంశాలపై మంత్రి మండలి సమావేశం సుదీర్ఘంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. 22 ఏలో తొలగించిన భూములు, పట్టా భూములు, ఇనాం భూములు గానీ మొత్తం 13.59 లక్షల ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో 13.57 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం పరిశీలన చేయించింది. కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఈ భూములను హస్తగతం చేసుకునేందుకు చాలా భూములను ఫ్రీహోల్డ్ చేయడానికి ప్రయత్నించారు.

ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పేదలకు అన్యాయం జరగకుండా, భూములు అన్యాక్రాంతం కాకుండా, పారిశ్రామిక అవసరాలకు, నిరుపేదల ఇళ్ల స్థలాలకు ఈ భూములు వినియోగించేలా, వీటన్నింటిపై పూర్తిస్థాయిలో సమీక్షించి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. చివరిగా రాష్ట్ర ఆదాయాన్ని, ఆర్థిక పరిస్థితిని ఏ విధంగా పెంచాలనే అంశంపై, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు అనుగుణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చేందుకు తీసుకోవల్సిన చర్యలపై చర్చించడంతోపాటు ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ మంత్రివర్గం తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు.

నిందితులను పట్టుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ తీసుకొచ్చి రెండు బ్యాగ్‌లు కొనుగోలు చేసిన ముఠా... వాటిల్లో డబ్బు నింపి పరారయ్యారు. వివిధ దోపిడీ కేసుల్లో అమిత్ కుమార్ కీలక నిందితుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులతో కలిసి బీదర్ పోలీసులు రాయ్‌పూర్ వెళ్లారు. రాయ్‌పూర్, బీహార్‌లో సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి దుండగులను పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ... నిందితులను పట్టుకునేందుకు 10 బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, నగర శివారు ప్రాంతాల్లో నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. దోపిడీ జరిగిన తీరు చూస్తే బీహారీలుగా అనుమనిస్తున్నామన్నారు. బీదర్ దోపిడీ తర్వాత నేరుగా హైదారాబాద్ అఫ్జల్‌గంజ్‌కు వచ్చారని, ఓ వ్యక్తి రెండు ట్రావెల్ బ్యాగ్‌లు షాప్‌లో కొన్నాడని, వీటిల్లో డబ్బు దాచారని చెప్పారు. ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌లో రాయ్‌పూర్ వెళ్లేందుకు రెండు టికెట్లు బుక్ చేసుకున్నారన్నారు. ఇద్దరి కదలికలు అనుమానంగా ఉండటంతో ట్రావెల్స్‌కు చెందిన జహంగీర్ అనే వ్యక్తి బ్యాగ్‌లు తనిఖీ చేయాలని పట్టుబట్టాడని తెలిపారు. అందులో డబ్బు ఉండటంతో హవాలా డబ్బుగా అనుమానించిన జహంగీర్ ... పోలీసులకు చెబుతాననడంతో దుండుగులు అతడిపై కాల్పులు జరిపినట్లు చెప్పారు. అక్కడి నుంచి తప్పించుకుని ఆటోలో ట్యాంక్ బండ్ వరకు వెళ్లారన్నారు. అక్కడి నుంచి బీహార్ వెళ్లి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఈస్ట్ జోన్ డీసీపీ వెల్లడించారు. కాగా, రెండు రోజుల క్రితం కర్నాటక రాష్ట్రంలోని బీదర్‌లో ... ఏటీఎంలో డబ్బులు జమ చేస్తున్న సిబ్బందిపై బైక్‌పై ముసుగుతో వచ్చిన ఇద్దరు దుంగులు కాల్పులు జరిపారు. ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు రూ.93 లక్షల నగదు తీసుకుని అక్కడి నుంచి రాయపూర్ పరారయ్యే క్రమంలో హైదరాబాద్‌కు వచ్చిన దుండగులు ఇక్కడ కూడా ఓ ట్రావెల్స్ ఉద్యోగిపై కాల్పులు జరపడం తీవ్ర కలకలం రేపింది.

విశాఖ ఉక్కుకు దన్ను

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు ప్రధాన మంత్రిని కలిసినప్పుడల్లా వైజాగ్ స్టీల్ ప్లాంట్ అంశమే ప్రధాన ఎజెండాగా చర్చించారని చెప్పారు. ప్యాకేజీ రావడానికి కృషి చేసిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి నెలలోనే కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి, కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారని గుర్తు చేశారు. ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిందని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. ప్లాంటు కార్మికులు, కుటుంబాలకు భద్రతే ధ్యేయంగా కేంద్రం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్లాంట్‌ను మరింత సమర్థంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఏపీ ప్రజలు ఉద్యమాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని తెలిపారు.

మావోయిస్టులకు దెబ్బ మీద దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

సుకమా, దంతెవాడ జిల్లాల నుంచి కోబ్రా, డీఆర్జీ, సీఆర్పీఎఫ్ జవాన్లు దాదాపుగా వెయ్యి మంది వరకు తరలి వెళ్లినట్లు తెలుస్తోంది. మావోయిస్టుల కోసం భద్రతా దళాలు అడవి మొత్తం జల్లెడ పడుతున్నాయి. మావోయిస్టులు సమావేశమవుతున్న సమాచారం తెలియడంతో భద్రత బలగాలు అక్కడికి వెళ్లి కాల్పులు జరిపాయి. సమావేశం అనంతరం మావోయిస్టులు అడవిలోకి వెళుతుండగా... భద్రతా బలగాలు వెంటాడి చంపినట్లుగా తెలుస్తోంది. భారీగా తరలివచ్చిన భద్రతా బలగాలు మావోయిస్టులను ఎవరినీ వదిలిపెట్టకుండా వెంటపడినట్లు తెలుస్తోంది. ఎదురుకాల్పుల్లో ఒక్క జనవరిలోనే 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాగా మావోయిస్టుల మందుపాతరకు 9 మంది జవాన్లు మృతి చెందారు. గతేడాది 270 మందికి పైగా మావోయిస్టులు పోలీసుల చేతిలో మృతి చెందారు. దీంతో మావోయిస్టుల ఏరివేతపై ప్రభుత్వం మరింత దృష్టి కేంద్రీకరించింది. వరుస ఎన్‌కౌంటర్‌లు బీజాపూర్ జిల్లాలోనే కొనసాగుతున్నాయి.

మావోయిస్టుల ఆయుధ కర్మాగారం స్వాధీనం

బీజాపూర్ సరిహద్దులో ఎన్‌కౌంటర్ తర్వాత...ఆ ప్రాంతాన్ని భద్రతా బలగాలు జల్లెడ పట్టాయి. ఆశ్చర్యకరంగా మావోయిస్టులకు సంబంధించిన భారీ సొరంగాన్ని కనుగొన్నాయి. సుక్మా-బీజాపూర్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న తుమ్రైల్, తాల్పేరు నది మధ్య మావోయిస్టుల ఆయుధ డంప్‌ను డీఆర్జీ సైనికులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీకి అవసరమైన సామగ్రిని సొరంగంలో నిల్వచేశారు. మావోయిస్టులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా సైనికులకు హాని చేయాలని పథకం రచించారు. మావోయిస్టులు బాంబుల తయారీకి గాజు సీసాలు ఉపయోగిస్తున్నారు. సొరంగం నుంచి ఆయుధాల తయారీ యంత్రం, ఎలక్ట్రిక్ వైర్, బాటిల్ బాంబు, భారీ మొత్తంలో పేలుడు పదార్థాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

'జేఈఈ' గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు హాజరవుతారు. ఇంటర్మీడియట్ తోపాటే జేఈఈ పరీక్షలకు శిక్షణ పొందడం ఆనవాయితీగా మారింది. మొదటి సెషన్ పరీక్షల అడ్మిట్ కార్డులను ఈనెల 19వ తేదీన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఏపీలో మొత్తం 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో అనంతపురం, భీమవరం, చిత్తూరు, ఏలూరు, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, మంగళగిరి, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, శ్రీకాకుళం, తిరుపతి, విజయనగరం, నరసరావుపేట, ప్రొద్దుటూరు, సూరంపాలెం, మచిలీపట్నం, నంద్యాల, తాడేపల్లిగూడెం తదితరాలు ఉన్నాయి. ఆయా జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ ప్రాధాన్యతా క్రమంలో తమకు కావాల్సి పరీక్ష కేంద్రాల్ని ఎంపిక చేసుకున్నారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ నిర్లక్ష్యంతో ఇంటర్ విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. జేఈఈ మెయిన్స్ పరీక్షకు సంబంధించి భీమవరం విద్యార్థులకు కేంద్రపాలిత ప్రాతమైన లద్దాఖ్ (గతంలో కశ్మీర్‌లో భాగంగా ఉన్న ప్రాంతం)లో ఎగ్జామ్ సెంటర్ కేటాయించడంతో వారికి దిక్కుతోచడంలేదు. ఈనెల 29న పేపర్-1(బీటెక్)కు లద్దాఖ్‌లోని కార్గిల్‌లో పరీక్ష కేంద్రాన్ని కేటాయించగా, ఈనెల 30న జరగబోయే పేపర్-2(బీఆర్క్)కు విశాఖ పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. భీమవరం నుంచి 3వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లద్దాఖ్ లో ఎలా పరీక్ష కేంద్రం కేటాయిస్తారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షా కేంద్రం కేటాయింపునకు సంబంధించి ఎన్‌టీఏ కాల్ సెంటర్‌కు, మెయిల్లకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. 29న లద్దాఖ్‌లోను, 30న విశాఖపట్నంలోను పరీక్ష రాయడం ఎలా సాధ్యమని విద్యార్థులు ఆవేదన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవద్దని, తమ పిల్లలు మనోవేదనకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఫిబ్రవరి 5న, రవిదాస్ జయంతి నేపథ్యంలో ఫిబ్రవరి 12న పార్లమెంటు కార్యకలాపాలకు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు.

బడ్జెట్‌పై సామాన్యుల ఆశలు

కేంద్ర బడ్జెట్‌పై సామాన్యుల్లో, వేతన జీవుల్లో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. అందుకనుగుణంగా ఈసారి పన్ను చెల్లింపుదారులకు ఊరటనివ్వాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి పెరిగి, వృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. ఫలితంగా ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ వసూళ్లు పెరిగి, ఖజానాకు పెద్ద మొత్తంలో రాబడి వస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

వేతన జీవులకు ఎలా ఊరట కల్పించాలనే అంశంపై కేంద్రం చాలా విషయాలను పరిశీలనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడం ఇందులో ఒకటి. గతేడాది బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో రూ.50,000గా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75,000కు కేంద్రం పెంచింది. ఈ మొత్తాన్ని మరింత పెంచడం కేంద్రం ముందున్న ఎంపికల్లో ఒకటి. ప్రస్తుతం రూ.15 లక్షల పైబడి వార్షికాదాయం పొందుతున్న వారికి 30 శాతం పన్ను వర్తిస్తోంది. ఈ మొత్తాన్ని రూ.18 లక్షలు, రూ.20 లక్షలు పైన సంపాదిస్తున్న వారికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రం ఆలోచనగా ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం వృద్ధిని నమోదు చేసిన భారత ఆర్థిక వ్యవస్థ... 2024-25లో 6.4 శాతం మాత్రమే వృద్ధిని నమోదు చేయొచ్చని కేంద్ర గణాంక కార్యాలయం అంచనాలను వెలువరించింది. ఆర్‌బీఐ కూడా 6.6 శాతం వృద్ధిని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 2025 బడ్జెట్‌లో వృద్ధికి ఊతమిచ్చే చర్యలు చేపట్టొచ్చన్న అంచనాలు పెరుగుతున్నాయి.

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందాలి : మంత్రి సీతక్క

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం, నిర్మల్ జిల్లా : ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా సమీకృత భావన సమావేశ మందిరంలో ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపికపై నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి కార్యచరణ ప్రణాళిక-సమీక్ష సమావేశంలో కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు వెంకటేష్ దోత్రే, కుమార్ దీపక్, రాజర్షి షా, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు, శాసనమండలి సభ్యులు దండే విఠల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల శాసనసభ్యులు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ జి.ఈశ్వర్ పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని, ఈనెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అదే రోజున అర్హులైన వారికి పథకాల ఫలాలు అందే విధంగా అధికారులు ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేసి గ్రామసభలో అర్హులను గుర్తించాలని, ఆయా గ్రామసభలలో స్థానిక ప్రజలు పాల్గొనేలా అధికారులుకృషి చేయాలన్గిన్నారు.

అన్ని విధాల దృఢంగా ఉండాలి : డీఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ మానసి కంగా, శారీరకంగా దృఢత్వాన్ని కలిగి ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హేమచంద్రాపురం లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోగల పరేడ్ గ్రౌండ్లో ఏఆర్ సిబ్బందికి మొబైలైజేషన్ పరేడ్ కార్యక్రమం ప్రారంభమయ్యింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ముఖ్యఅతిథిగా డీఎస్పి రెహమాన్ పాల్గొని మాట్లాడారు. 15 రోజుల పాటు జరిగే ఈ మొబలైజేషన్ కార్యక్రమంలో పోలీసు శాఖలో కాలానుగుణంగా అనుసరిస్తున్న శిక్షణను ఏఆర్ సిబ్బందికి అందించనున్నట్లు చెప్పారు. పోలీసులు దృఢత్వం కలిగి ఉన్నప్పుడే క్లిష్ట పరిస్థితులను అధిగమించి విధులను క్రమశిక్షణతో నిర్వర్తిస్థారన్నారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ అనేది చాలా కీలకమన్నారు. రిఫ్రెష్ కోర్స్ లాంటి మొబలైజేషన్ ఆర్మడ్ రిజర్వ్ సిబ్బందికి చాలా అనివార్యమన్నారు. శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను నిత్యం సాధన చేస్తుండాలని డిఎస్పి సూచించారు. ఈ శిక్షణ పొందిన వారు ఇండోర్, ఔట్డోర్, ఫైరింగ్ ప్రాక్టీస్ లో ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. అధికారులు, సిబ్బందికి వ్యక్తిగత, కుటుంబపరమైన, శాఖాపరమైన ఒత్తిడులు, సమస్యలను ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు, ఎంటిఓ సుధాకర్, హోంగార్డ్స్ ఆర్ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఫలితాలిస్తున్న సోలార్ ప్లాంట్లు, బోర్లు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లాలోని ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేని చోట ప్రత్యామ్నాయంగా సోలార్ పవర్ ద్వారా విద్యుత్ సౌకర్యం పొందుతూ రెండు పంటలు పండించుకుంటున్న రైతులను ఐటిడిఏ పిఓ బి.రాహుల్ అభినందించారు. శుక్రవారం లక్ష్మీదేవి పల్లి మండలంలోని బొజ్జలగూడెం, లక్ష్మీపురం, బంగారుచలక, గ్రామంలోని రైతులు సోలార్ ప్లాంట్ ద్వార బోర్వెల్ పంపు సెట్లతొ పంటలు పండిస్తున్న పొలాలను ఆయన పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం లేక రైతులు వర్షాధార పంటలపై ఆధారపడుతున్నా రని దీనివల్ల వారు నష్టాలు నష్టాల పాలవుతున్నారని రాహుల్ అన్నారు. గ్రామాల రైతులు సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుకొని రెండు పంటలు పండించుకోవటం మంచి పరిణామం అన్నారు. గతంలో తమ గ్రామాల్లో నీటి సౌకర్యం లేక పంటలు ఎండిపోయేవని 2017- 18 ఏడాదిలో రెడ్ కో సంస్థ గిరిజన రైతులకు ప్రత్యేకంగా సలహాలు, సూచనలు ఇచ్చి సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు రైతులు వెల్లడించారు. తాము బోర్ వెల్స్ తవ్వించుకున్నామని వీటికి కి సోలార్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో రెండు పంటలు పండించుకుంటున్నామన్నారు. సోలార్తో పాటు తమకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తే భూములు సస్యశ్యామలమౌతాయని రైతులు పీఓని అభ్యర్థించారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, మైనింగ్ ఏ డిఈ రమేష్, రెడ్కో జీఎం అజయ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ రఘురామయ్య, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ ఏఈ మునీర్ పాషా ఫారెస్ట్ జాయింట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎఎస్ఐ సైదులుకు ఎస్ఐగా పదోన్నతి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పోలీస్స్టేషన్ నందు గత సంవత్సర కాలంగా ఎఎస్ఐ సైదులు విధులు నిర్వహిస్తున్నారు. ఎస్ఐగా పదోన్నతి వచ్చినందున శుక్రవారం స్థానిక ఎస్ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో సైదులుకు శాలువాతో సత్కారించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి : జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను సమీకృత జిల్లా కలెక్టరేట్లో రామగుండంలోని తబిత సంరక్షణ కేంద్రం పిల్లలు వచ్చి కలిసారు. తబిత ఆశ్రమంలో చదువుతున్న 10 మంది విద్యార్థులను గుర్తించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వారికి భూపాల్ పల్లి జిల్లా కాటారం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించారు. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఆశ్రమానికి వచ్చిన పిల్లలు జిల్లా కలెక్టర్ను కలిసి తమ బాగా చదువుకుంటున్నామని, జీవితంలో ఉన్నత స్థాయిలో ఉంటామని తెలిపారు. మనకు జీవితంలో అనేక కష్టాలు, బాధలు వస్తాయని, వాటిని అధిగమించి ధైర్యంగా నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని కలెక్టర్ పిల్లలకు సూచించారు. ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వ్యాయామం చేయాలని, కొంత సమయం క్రీడలకు కేటాయించాలని, ఉల్లాస వాతావరణంలో చదువుకోవాలని, చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గురుకులాల్లో సీట్ ఇప్పించిన జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ కు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్కు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కమలాకర్ పాల్గొన్నారు.

అర్బన్ పార్కును టూరిస్ట్ స్పాట్గా అభివృద్ధి చేస్తాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : వెలుగుమట్ల అర్బన్ పార్క్ను టూరిస్ట్ స్పాట్గా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ఖాన్తో కలిసి స్థానిక వెలుగుమట్ల అర్బన్ పార్కును సందర్శించారు. పార్క్ అభివృద్ధి ప్రణాళిక ను మంత్రి పరిశీలించి, పార్క్లో కలెక్టర్, అధికారులతో కలిసి మొత్తం పార్క్ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలోపు పార్కును టూరిస్ట్ స్పాట్గా అభివృద్ధి చేయాలని అన్నారు. ఖమ్మం చరిత్ర నేపథ్యంతో ఆకర్షణీయంగా ఉండే విధంగా వెలుగుమట్ల అర్బన్ పార్క్కు మంచి పేరు పెట్టాలని అన్నారు. ఖమ్మంతో పాటు కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలలో కూడా అర్బన్ పార్క్ల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వెలుగు మట్ల అర్బన్ పార్కుకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, కొంత మంది అనాలోచితంగా తమ భూమి సెంటు, గజం పోతుందని ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుతం ఉన్న భూమి విలువ కంటే రోడ్డు వేసిన తర్వాత 10 రెట్లు పెరుగుతుందన్నారు. రోడ్డు బాగుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. పార్క్ వద్ద ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని సూచించారు. ఇక్కడ క్యాంటీన్లో కూడా చిరు ధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పెట్టాలని, స్వశక్తి మహిళా సంఘాలచే స్టాల్ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్క్ భూమి బౌండరీ, చుట్టూ ఫెన్సింగ్ చేయాలన్నా, అటవీశాఖ అధికారి మాట్లాడుతూ 2016లో ఇక్కడ 500 ఎకరాలకు పైగా అటవీ స్థలంలో ఈ పార్కును అప్పటి మంత్రి ఇప్పటి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సర్వతో పార్కు ఏర్పాటు అయిందన్నారు. గతంలో నెలకు 50 నుంచి 60 వేల ఆదాయం వస్తే ప్రస్తుతం నెలకు 2 లక్షలకు పైగా ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పూనుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, శిక్షణ ఐపీఎస్ రుత్విక్ సాయి, డిఆర్డీవో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కార్పొరేటర్లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రసాద్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువజనోద్యమాలతోనే సమాజ మార్పు : బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : యువజనోద్యమాలతోనే సమాజంలో మార్పు వస్తుందని దేశ చరిత్రలో అఖిల భారత యువజన సమాఖ్య చేసిన ఉద్యమాలు అజరామరమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువశక్తిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని తద్వారా యువశక్తి నిర్వీర్యం అవుతుందని ఆయన అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రూపొందించిన 2025 క్యాలెండర్ను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్తో కలిసి శుక్రవారం గిరిప్రసాద్ భవన్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐవైఎఫ్ నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమని స్వాతంత్ర్య అనంతరం యువజన హక్కుల కోసం, ఉపాధి కల్పన కోసం చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిందన్నారు. మతోన్మాదం పెచ్చరిల్లుతున్న వేళ సమాజాన్ని పెను ప్రమాదం నుంచి కాపాడాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని యువశక్తిని వినియోగించుకోలేని ఏ దేశం ముందుకు సాగలేదని ఈ చారిత్రక సత్యాన్ని భారతదేశ పాలకులు మరిచిపోవడం శోచనీయమన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని యువజనులకు సూచించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె జానిమియా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గౌసా పాషా, నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రావణ్ కుమార్, మునిగ కోటేశ్వరరావు, ఉసికల రవి, జి. ఉపేందర్, మామిళ్ల శ్రీనాథెడ్డి, మల్లెబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నుండి విద్యార్థులను కాపాడాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : మత్తు పదార్థాల వినియో గం బారిన పడకుండా విద్యార్థులను కాపాడాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి. ఎక్సైజ్, పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఎక్సైజ్, పోలీస్ సహా వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో కళాశాలలు, వివిధ వసతి గృహాలను సందర్శించాలని అన్నారు. అక్కడ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులు పెడదోవ పట్టకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వాడకం పూర్తిగా నిరోధించాలని సూచించారు. ఎక్కడైనా, ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు తేలితే వారికి డి అడిక్షన్ సెంటర్లో కౌన్సిలింగ్ ఇప్పించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను పరిశీలించాలని సూచించారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిసిఆర్బీ డిఎస్పి కిషోర్, ఆంటీ నార్కోటిక్ డిఎస్పి సైదులు, కలెక్టరేట్ కార్యాలయ సూపర్ ఇండెంట్ మహేష్ బాబు, డిఈఓ పాణిని, డిఐఓ, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

మారుతి ఈకో 12 లక్షల యూనిట్ల సేల్

న్యూఢిల్లీ: మారుతి సుజుకి ఈకో భారతదేశంలో 12 లక్షలకు పైగా యూనిట్లను విక్రయించింది. ఈకో 2010లో ప్రారంభించినప్పటి నుంచి దేశీయ మార్కెటలో 15 సంవత్సరాలు పూర్తి చేసుకొని కీలక మైలురాయిని చేరుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ వాహనం దాని విభాగంలో 90 శాతం వాటాను కలిగిఉంది. ఇది 5 సీటర్, 7 సీటర్, కార్గో, టూర్, అంబులెన్స్ కాన్ఫిగరేషన్లతో సహా 13 విభిన్న వేరియంట్లలో ప్రత్యేకత కలిగి ఉంది. ఇది 1.2 లీటర్ కె-సిరీస్ డ్యూయల్ జెట్, డ్యూయల్ వివిటి ఇంజిన్తో పనిచేస్తుంది. దాని మొత్తం వాల్యూమ్లలో ఎస్-సిఎన్జి మోడల్ 43 శాతం వాటాను కలిగి ఉంది. కంపెనీ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మారుతీ ఈకో బ్రాండ్ను విశ్వసించినందుకు కస్టమర్లకు ధన్యవాదాలు తెలిపారు.

మహా కుంభమేళాలో మమేకమైన అమేజాన్ ఇండియా

బెంగళూరు: ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే 2025 మహా కుంభ మేళాలో సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి, వినూత్నమైన ఆలోచనతో సమస్యను నిర్వహించడానికి అమేజాన్ ఇండియా సిద్ధమైంది. జనవరి, ఫిబ్రవరిలలో, లక్షలాది భక్తులు ఈ 45 రోజుల పండగ కోసం ప్రయాగ్ రాజ్, ఉత్తర్ప్రదేశ్ను సందర్శిస్తారు. ఈ కార్యక్రమం జరిగే సమయంలో సౌకర్యవంతమైన విశ్రాంతి కోసం అమేజాన్ ఇండియా విలక్షణమైన చొరవను ప్రారంభించింది, దీనిలో భాగంగా తమ సిగ్నేచర్ కార్డ్ బోర్డ్ ప్యాకేజింగ్ బాక్స్లను పొందికైన బెడ్స్గా మారుస్తాయి. మేళాకు హాజరైన వారికి ఎన్నో గంటల సౌకర్యవంతమైన నిద్రను కలగచేస్తాయి. అందరికీ అందుబాటులో ఉండే విధంగా వీటిని సందర్శకులకు ఉచితంగా అందచేస్తున్నారు.మేళా జరిగే మైదానంలో కీలకమైన ప్రాంతాలను గుర్తించడానికి అమేజాన్ మహా కుంభ్ అధికారులతో సన్నిహితంగా పని చేసింది.

మ్యూజిక్ ఫెస్టివల్- రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్కు రంగం సిద్ధం

ముంబయి: సమకాలీన హిప్-హాప్ బీట్స్తో బాలీవుడ్లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాలను మిశ్రమం చేసిన తమ మూడవ ఎడిషన్ కోసం సీగ్రమ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మళ్లీ వచ్చింది. ఈ సీజన్ ను మిర్చి తయారు చేస్తుండటంతో, ఈ లీనమయ్యే మ్యూజిక్ ఫెస్టివల్ జనవరి 14, 2025న ముంబైలో జరిగిన ప్రత్యేక మీడియా ప్రివ్యూలో రాబోతున్న శ్రేణిని ప్రదర్శించింది. ఈ విలక్షణమైన సాంస్కృతిక కలయిక సంప్రదాయబద్ధమైన, ఆధునిక భారతదేశపు సంగీతం కూడలిని పునర్నిర్వచించడం కొనసాగించింది, బ్రాండ్ 'లివింగ్ ఇట్ లార్జ్ లీ' సిద్ధాంతానికి చిహ్నంగా నిలిచింది. వినియోగదారులు పాల్గొనడానికి కీలకమైన మూలస్తంభంగా బ్రాండ్ కోసం మ్యూజిక్ నిలిచింది. రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ బాలీవుడ్ శాశ్వతమైన శ్రావ్య గీతాలను హిప్-హాప్ ఉత్సాహంతో ఎంతో ధైర్యంగా కలిపింది. నేటి తరం, జనరేషన్ లార్జ్ ఒరిజినల్ సౌండ్ను తయారు చేసింది.

ఇల్లందు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

విశాలాంధ్ర - ఇల్లందు : ప్రతి ఎకరాకు సాగునీటిని అందించి ఇల్లందు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్లను, చెక్ డ్యాములను పూర్తి చేస్తామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోళ్లపాడు ప్రాజెక్టును మళ్లించి స్థానిక ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రోళ్ళపాడు ప్రాజెక్టు తో నియోజకవర్గంలోని సాగు భూములకు నీరు పుష్కలంగా అందించ డమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ప్రభుత్వ ఇల్లందు ఎమ్మెల్యే ఈ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. తన హాయంలో అభివృద్ధి చేయటం చేతగాక గత ఎమ్మెల్యే ప్రెస్ మీట్లు పెట్టి కాంగ్రెస్ను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రైతులకు అవసరమైన సాగునీటిని అందిస్తామన్నారు. అవసరమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, చెక్ డ్యాంములను నిర్మించి సాగు విస్తీర్ణాన్ని పెంచుతామని రైతులకు హామీ ఇచ్చారు. రోళ్లపాడు, బయ్యారం పెద్ద చెరువులలో నీటి లభ్యత ఎక్కువగా ఉందన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి నీళ్ల ఇచ్చే విధంగా కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. అవసరమైన ప్రతిచోట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు, చెక్ డ్యాంలను నిర్మించి ఆదుకుంటామన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ చారి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ రాంబాబు, పిఎసిఎస్ చైర్మన్లు మెట్ల కృష్ణ, దుర్గాప్రసాద్, మధుకర్ రెడ్డి, వీరభద్రం, హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, దొడ్డ డానియల్, మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, శ్రీనివాసరావు, పులి సైదులు, మండల రాము, తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్కు రీబ్రాండ్

హైదరాబాద్: యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్గా గతంలో మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ రీ బ్రాండ్ చేయబడిందని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రశాంత్ త్రిపాఠి వెల్లడించారు. కార్పొరేట్ అండ్ రెగ్యులేటరీ ఆమోదాల తర్వాత దాని కార్పొరేట్ పేరులో 'యాక్సిస్'ని చేర్చినట్లు ప్రకటించారు. అదనంగా, కంపెనీ యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్గా రీబ్రాండ్ చేయబడిందని, దాని బ్రాండ్ పరిణామంలో కీలక మైలురాయిని సూచిస్తుందన్నారు. ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టార్లో రెండు విశ్వసనీయ పేర్లను ఏకీకృతం చేయడం వల్ల మెట్రోలు, టైర్ 1 నగరాలకు మించి వ్యూహాత్మక విస్తరణ ద్వారా కంపెనీ తన దీర్ఘకాలిక వృద్ధి ఆకాంక్షలను సాధించడానికి అధికారం ఇస్తుందన్నారు. యాక్సిస్ ఐకానిక్ 'ఏ' బుర్గుండి షేడ్ని చేర్చడం ద్వారా రిఫ్రెష్ చేయబడిన బ్రాండ్ గుర్తింపు కొత్త లోగోలో ప్రతిబింబిస్తుందని, కొత్త కార్పొరేట్ పేరు లోగోతో సహా రిఫ్రెష్ చేయబడిన బ్రాండ్ గుర్తింపు, కీలకమైన వాటాదారులతో కూడిన సమగ్ర మార్కెటింగ్ పరిశోధన ఫలితం అన్నారు.

ఐఎండీబీ మోస్ట్ అవైటెడ్ ఇండియన్ మూవీస్ జాబితా

ముంబయి: సినిమాలు, టీవీ షోలు, ప్రముఖులపై సమాచార విషయంలో ప్రపంచంలోని అత్యంత ప్రాచుర్యం పొందిన ఐఎండీబీ తాజాగా 2025 మోస్ట్ అవైటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో సికందర్ మొదటిస్థానం పొందగా, టాక్సిక్ రెండో స్థానాన్ని పొందింది. తదుపరి స్థానాల్లో కూలీ, హౌస్ఫుల్ 5, బాఘీ 4, రాజా సాబ్, వార్ 2, ఎల్2: ఎంపురాన్, దేవా, చావా, కన్నప్ప, రెట్రో, థగ్ లైఫ్, జాట్, స్కై ఫోర్స్, సితారే జమీన్ పర్, థామా, కాంతారా ఏ లెజెండ్: చాప్టర్ 1, ఆల్ఫా, తండేల్ చిత్రాలు ఉన్నాయి. నెం.1 మోస్ట్ అవైటెడ్ ఇండియన్ మూవీ సికందర్ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ మాట్లాడుతూ 2025 ఐఎండిబి మోస్ట్ అవైటెడ్ ఇండియన్ మూవీస్లిస్ట్లో సికందర్ అగ్రస్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ జాబితాలోని 20 టైటిల్స్ లో 11 హిందీ సినిమాలు, మూడు తమిళ, తెలుగు, రెండు కన్నడ, ఒకటి మలయాళ సినిమా కావడం గమనార్హం.

డిస్నీ+ హాట్స్టార్లో 26న అహ్మదాబాద్లో కోల్డ్ప్లే ప్రత్యక్ష ప్రదర్శన

ముంబయి: కోల్డ్ప్లేతో కలిసి వారి ఐకానిక్ మ్యూజిక్ ఆఫ్ ది స్పియర్స్ వరల్డ్ టూర్ కచేరీని భారతదేశం అంతటా ప్రేక్షకులకు ప్రత్యక్షంగా ప్రదర్శించడం ద్వారా లైవ్ స్ట్రీమింగ్ వినోద అనుభవాలలో కొత్త ప్రమాణాలను డిస్నీ+ హాట్స్టార్ నెలకొల్పడానికి సిద్ధమైంది. గణతంత్ర దినోత్సవం నాడు అహ్మదాబాద్లో తమ అతిపెద్ద స్టేడియం ప్రదర్శనకు బ్యాండ్ సిద్ధమవుతున్నందున, ఈ వేదిక అధిక-నాణ్యత అనుభవాలకు అందరికీ చేరువ చేయడం ద్వారా వినోదం భవిష్యత్తును పునర్నిర్వచించింది, అభిమానులు దేశవ్యాప్తంగా ప్రతి స్క్రీన్పై ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమ అనుభవాలను సొంతం చేసుకోవటానికి వీలు కల్పిస్తుంది. డిస్నీ+ హాట్స్టార్ కచేరీని అద్భుతమైన నాణ్యతతో ప్రసారం చేస్తుంది. జియోస్టార్-స్పోర్ట్స్ సీఈఓ సంజోగ్ గుప్తా మాట్లాడుతూ, డిస్నీ+ హాట్స్టార్లో అసమానమైన, లీనమయ్యే అనుభవాలతో వినోదం, క్రీడా వినియోగాన్ని విప్లవాత్మకంగా మార్చామన్నారు.

అసిస్టెడ్ లివింగ్లోకి ప్రవేశిస్తున్న స్టోన్క్రాఫ్ట్ గ్రూప్

హైదరాబాద్: ప్రముఖ ఇంటిగ్రేటెడ్ బయోఫిలిక్ రియల్ ఎస్టేట్ డెవలపర్ అయిన స్టోన్క్రాఫ్ట్ గ్రూప్, హైదరాబాద్లో తమ మొదటి లగ్జరీ/ప్రీమియం అసిస్టెడ్ లివింగ్ ప్రాజెక్ట్తో అసిస్టెడ్ లివింగ్ (సీనియర్ లివింగ్) విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్లో అతిపెద్ద, అత్యంత విలాసవంతమైన/ప్రీమియం సీనియర్ లివింగ్ ప్రాజెక్ట్గా నిలువనుంది. హైదరాబాదులోని యాదగిరిగుట్టలో వ్యూహాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్ట్ సీనియర్ సిటిజన్లకు సకల సౌకర్యాలు అందించనుంది. ఎయిమ్స్ తో సహా ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యత కారణంగా యాదగిరిగుట్ట ఈ ప్రాజెక్ట్ కోసం జాగ్రత్తగా ఎంపిక చేయబడింది. హైదరాబాద్, చుట్టు పక్కల సీనియర్ లివింగ్ కోసం ప్రత్యేకంగా సహాయక వాతావరణాన్ని అందిస్తుంది.

రియల్మీ 14 ప్రో సిరీస్ విడుదల

న్యూఢిల్లీ: ప్రముఖ స్మార్ట్ఫోన్ బ్రాండ్ రియల్మీ తాజాగా ఏఐఓటీ పోర్ట్ఫోలియోని ఎక్కడా చూడని ఉత్పత్తులలో ప్రవేశపెట్టింది. అత్యంత మెరుగైన రియల్మీ 14 ప్రో సిరీస్ 5జి, రియల్మీ బడ్స్ వైర్ లెస్ 5ని అందిస్తుంది. రియల్మీ 14 సిరీస్ 5 జిలో రియల్మీ 14 ప్రో 5 జి, రియల్ మీ 14 ప్రో+ 5 జి అనే రెండు రకాలు అందుబాటులో ఉన్నాయి. రెండు ఫోన్లు ప్రఖ్యాత డానిష్ డిజైన్ స్టూడియో, వాలూర్ డిజైనర్ల సహకారంతో చాలా సూక్ష్మంగా రూపొందాయి. ఇది ప్రపంచంలోని మొట్టమొదటి చల్లని-సెన్సిటివ్ రంగు-మారుతున్న స్మార్ట్ఫోన్ల ప్రారంభానికి గుర్తుగా ఉంది. కొత్తగా పునరుద్ధరించిన రియల్మీ నంబర్ సిరీస్ ప్రారంభ సమర్పణగా, రియల్మీ 14 ప్రో సిరీస్ 5జీ మధ్య-శ్రేణి స్మార్ట్ఫోన్లలో ఫ్లాగ్షిప్ ఫీచర్లను ప్రాచుర్యం పొందడం, డిజైన్, ఇమేజింగ్, పనితీరులో విశేషమైన పురోగతులను సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది. రియల్మీ 14 ప్రో సిరీస్ 5 జి అనేది ఒక మెరుగైన పరికరం. అది వివిధ పారిశ్రామిక మొదళ్ళను మెరుగుపరుస్తుంది. అది ప్రపంచంలో మొదటి కోల్డ్ సెన్సిటివ్ రంగులను మార్చే ఫోన్ ఫీచర్స్తో వస్తుంది.

హైబ్రిడ్ ఇన్వెస్ట్మెంట్ విధానాన్ని సిఫార్సు చేస్తున్న ఎంఓపీడబ్ల్యు

ముంబై: మోతీలాల్ ఓస్వాల్ ప్రైవేట్ వెల్త్ (ఎంఓపీడబ్ల్యు) ప్రకారం, కొత్త ట్రంప్ పరిపాలన విధానాలు, వాణిజ్యాన్ని ఎదుర్కోవడానికి చైనా తీసుకున్న చర్యలతో సహా అనేక ప్రపంచ, దేశీయ సంఘటనల కారణంగా 2025 ప్రథమార్థంలో భారతీయ మార్కెట్లు అస్థిరంగానే ఉంటాయని అంచనా. టారిఫ్లు, ఈఎం కరెన్సీలకు దాని సాధ్యమైన చిక్కులు, రాబోయే ఇండియన్ యూనియన్ బడ్జెట్. ఈ సంఘటనలు సమీప కాలంలో అనిశ్చితిని సృష్టించే అవకాశం ఉంది. ఏదేమైనప్పటికీ, ఈ సంఘటనలు వెల్లడి కావడం, మరింత స్పష్టత రావడంతో, సంవత్సరం చివరి భాగంలో మార్కెట్ అస్థిరత తగ్గుతుందని భావిస్తున్నారు. జీడీపీలో ఇటీవలి మందగమనం ఉన్నప్పటికీ, ఎంఓపీడబ్ల్యు దాని స్థూల ఆర్థిక స్థిరత్వం, గణనీయమైన విదేశీ మారక నిల్వలు, నియంత్రిత జంట లోటు కారణంగా భారతదేశ వృద్ధిపై ఆశాజనకంగా ఉంది. ఇది క్యూ2 ఎఫ్వై25లో నివేదించబడిన స్వల్ప వృద్ధితో పోలిస్తే జీడీపీ వృద్ధిని మెరుగుపరుస్తుందని అంచనా వేసింది. ఎంఓపీడబ్ల్యు ఎండీ, సీఈవో ఆశిష్ శంకర్ మాట్లాడుతూ, ఈక్విటీ ఇన్వెస్ట్మెంట్దారులకు ఆదాయాల పెరుగుదల, మాక్రోలను మెరుగుపరచడం, ఈక్విటీలలోకి దేశీయ ఇన్ఫ్లోల ద్వారా నడిచే ఈక్విటీ అనంతర కాలం చాలా లాభదాయకంగా ఉందన్నారు.

ఫిబ్రవరిలో తిరుపతిలో దేవాలయాల మహాకుంభ్

ముంబయి: అంతర్జాతీయ దేవాలయాల సదస్సు మరియు ఎక్స్పో (ఐటీసీఎక్స్) దాని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండవ ఎడిషన్తో మహోన్నతంగా తిరిగి వస్తోంది. 2023లో దాని ప్రారంభ అధ్యాయం అద్భుతమైన విజయం, విస్తృత ప్రశంసలను సంపాదించిన నేపథ్యంలో, ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మద్దతు కూడా లభించింది. ఈ సంవత్సరం, ఈ సమావేశం స్థాయి, పరిధిలో మరింత అద్భుతంగా ఉంటుందని హామీ ఇచ్చింది. ఫిబ్రవరి 17 నుండి 19, 2025 వరకు ఆంధ్రప్రదేశ్లోని పరమ పవిత్రమైన ఆలయ నగరమైన తిరుపతిలో ఇది జరగనుంది. టెంపుల్ కనెక్ట్ (ఇండియా) ద్వారా అభివృద్ధి చేయబడిన ఐటీసీఎక్స్, ప్రపంచవ్యాప్తంగా దేవాలయాల సమగ్ర నిర్వహణకు ప్రత్యేకంగా అంకితమైన ప్రపంచంలోని మొట్టమొదటి ప్రతిష్టాత్మక వేదికగా నిలుస్తుంది, ఇది ఆలయ ఆర్థిక వ్యవస్థ పరిపాలన, కార్యకలాపాలు, పురోగతిలో శ్రేష్ఠతను సాధికారపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి నేతృత్వంలో జరుగుతున్న ఈ మైలురాయి కార్యక్రమానికి ప్రసాద్ లాడ్ (ఐటీసీఎక్స్ 2025 చైర్మన్, మహారాష్ట్ర శాసనమండలి సభ్యుడు) సహ-నాయకత్వం వహిస్తున్నారు.

భారత్ ఎన్సీఏపీ క్రాష్ టెస్ట్లో స్కోడా కైలాక్కు 5-స్టార్ రేటింగ్

ముంబయి: భారత్ ఎన్సీఏపీ (న్యూ కార్ అసెస్మెంట్ ప్రోగ్రామ్)లో స్కోడా ఆటో ఇండియా మొదటి సబ్-4 మీటర్ల ఎస్యువి కైలాక్, ప్రతిష్టాత్మకమైన 5-స్టార్ భద్రతా రేటింగ్ను సాధించింది. దీనితో భారత్ ఎన్సీఏపీ పరీక్షలో పాల్గొన్న మొట్టమొదటి స్కోడా వాహనంగా కైలాక్ నిలిచి, కుషాక్, స్లావియా నెలకొల్పిన భద్రతా శ్రేష్ఠత బ్రాండ్ వారసత్వాన్ని కొనసాగిస్తోంది. స్కోడా ఆటో ఇండియా 2.0 కార్లు రెండూ పెద్దలు, పిల్లల ప్రయాణికుల రక్షణ కోసం సంబంధిత గ్లోబల్ ఎన్సీఏపీ క్రాష్ పరీక్షలలో 5-స్టార్ భద్రతా రేటింగ్లను సాధించాయి. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా మాట్లాడుతూ, భద్రత అనేది స్కోడా జన్యువుల్లో అంతర్లీనంగా ఉంటుందన్నారు. అదే విధంగా, 2008 నుంచి ప్రతి స్కోడా కారు ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో క్రాష్-టెస్టులను ఎదుర్కొని 5-స్టార్ భద్రతా రేటింగ్లను దక్కించుకుంది. స్కోడా ఆటో భారతదేశంలో కార్ల భద్రతపై 5-స్టార్ భద్రతా-రేటెడ్ కార్ల సముదాయంతో ప్రచారానికి నాయకత్వం వహిస్తోందని తెలిపారు.

మహా కుంభ్ 2025లో కోకా-కోలా ఇండియా ఉత్పత్తులు

న్యూఢిల్లీ: కోకా-కోలా ఇండియా 2025 ప్రపంచంలోని అతిపెద్ద సాంస్కృతిక కార్యక్రమాలలో ఒకటైన మహా కుంభ్లో సందడి చేస్తోంది. తన ఐకానిక్ బ్రాండ్లు-కోకా-కోలా, థమ్స్ అప్, స్ప్రైట్, ఛార్జ్డ్, మాజా, కిన్లీ, ఫాంటా, మినిట్ మెయిడ్లను ఈ కార్యక్రమానికి హాజరుకానున్న లక్షలాది మందికి అందుబాటులో ఉంచనుంది. కోకా-కోలా ఉత్పత్తులు ప్రతి 400 మీటర్లకు అందుబాటులో ఉన్నందున, సందర్శకులు తమ దాహాన్ని తీర్చుకోవడానికి దూరంగా వెళ్లాల్సిన అవసరం ఉండదని బ్రాండ్ నిర్ధారిస్తుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, భారతదేశ గొప్ప సంస్కృతీ సంప్రదాయాలకు గుర్తుగా ఎంపిక చేసిన పానీయాల కోసం కంపెనీ మహా కుంభ్ స్పెషల్ ఎడిషన్ ప్యాకేజింగ్ను విడుదల చేస్తోంది. ప్రత్యేకమైన డిజైన్లు దాని ఉత్పత్తులకు స్థానిక సాంస్కృతిక స్పర్శను అందిస్తూ, చిరస్మరణీయమైన జ్ఞాపకాలను సృష్టిస్తాయి. అదనంగా, ఆన్-గ్రౌండ్ ఉనికిని వినియోగదారుల సౌలభ్యం, మనస్సులో ఆనందంతో రూపొందింది. హైడ్రేషన్ కార్టులు మరియు ఫుడ్ కోర్ట్ యాక్టివేషన్లు సందర్శకులు తమ దాహాన్ని సులభంగా తీర్చుకోవచ్చని నిర్ధారిస్తుంది.

50శాతం వరకు తగ్గింపుతో సెన్హైజర్ రిపబ్లిక్ డే ఆఫర్లు

ముంబయి: ఆడియో టెక్నాలజీలో అగ్రగామిగా ఉన్న సెన్హైజర్, అమెజాన్లో ప్రారంభమైన రిపబ్లిక్ డే సేల్ 2025 సందర్భంగా ప్రైమ్, నాన్-ప్రైమ్ సభ్యులు సహా అందరు కస్టమర్లకు అద్భుతమైన డీల్లను అందిస్తోంది. ప్రొఫైల్ స్ట్రీమింగ్ సెట్ (బూమ్ ఆర్మ్తో) పాడ్కాస్టింగ్ కోసం యుఎస్బి మైక్రోఫోన్, హెచ్డీ 490 ప్రో ప్లస్ ఓపెన్-బ్యాక్ స్టూడియో హెడ్ఫోన్లు, ఈడబ్ల్యుడీపీ-ఎంఈ 2 డిజిటల్ వైర్లెస్ మైక్రోఫోన్ సిస్టమ్, మోమెంటమ్ 4 (కాపర్) హెడ్ఫోన్లు, యాక్సెంటమ్ ప్లస్ హెడ్ఫోన్లు, మోమెంటమ్ ట్రూ వైర్లెస్ 4తో సహా సెన్హైజర్ టాప్-రేటెడ్ ఉత్పత్తులపై 24 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐ, అదనపు డిస్కౌంట్లను సద్వినియోగం చేసుకోవచ్చు. అన్నీ 50% వరకు తగ్గింపుతో అందుబాటులో ఉన్నాయి.

కొత్త ఉద్యోగంలో చేరాలంటున్న 82శాతం నిపుణులు

న్యూఢిల్లీ: భారతదేశంలో ప్రస్తుతం 5 మందిలో 4 గురు (82%) నిపుణులు ఈ సంవత్సరం కొత్త ఉద్యోగం కోసం వెతకాలని యోచిస్తున్నారు. అయితే ప్రపంచంలోని అతిపెద్ద ప్రొఫెషనల్ నెట్వర్క్ అయిన లింక్డ్ఇన్ నుండి వచ్చిన కొత్త పరిశోధన ప్రకారం, గత సంవత్సర కాలంలో ఉద్యోగ శోధన కష్టతరం అయిందని సగం కంటే ఎక్కువ మంది (55%) చెబుతున్నారు. భారతీయ హెచ్ఆర్ నిపుణులలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది (69%) కూడా ఇదే విధంగా భావిస్తున్నారు, ఇది 2025లో నిపుణులు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన విధానంలో, ఉద్యోగం పొందాల్సిన విధానంలో అవసరమైన మార్పును సూచిస్తుంది. 2024లో ఉద్యోగార్థులు అతి నెమ్మదిగా కదిలిన లేబర్ మార్కెట్ను చూశారు. ఇక్కడ వేగం చాలా తక్కువగా ఉంది. 2025 ప్రారంభం నాటికి, 2024లో కొత్త ఉద్యోగం కోసం చూస్తున్న ప్రతి ఐదుగురిలో ఒకరు (15%) ఇప్పటికీ కొత్త అవకాశాల కోసం చూస్తున్నారు.

శివ్నాడార్ వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ లా ప్రోగ్రామ్ అడ్మిషన్లు

చెన్నై: చెన్నైలోని శివ్ నాడార్ విశ్వవిద్యాలయం 2024లో శివ్ నాడార్ స్కూల్ ఆఫ్ లాను ప్రారంభించగా, ఇప్పుడు 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బి.ఎ., ఎల్.ఎల్.బి. ప్రోగ్రామ్ రెండవ ఇన్కమింగ్ బ్యాచ్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. నైతిక, ప్రపంచవ్యాప్తంగా సమర్థులైన, సామాజికంగా బాధ్యతాయుతమైన న్యాయ నిపుణులను పెంపొందించడంపై దృష్టి సారించిన ఈ కార్యక్రమం ట్రూ-బ్లూ లిబరల్ ఆర్ట్స్ ప్రోగ్రామ్ను చట్టపరమైన నైపుణ్యాలపై దృష్టి సారించే ప్రత్యేకమైన బోధనతో మిళితం చేస్తుంది. దరఖాస్తులను 'అప్లయ్.ఎస్ఎన్యూచెన్నైఅడ్మిషన్స్.కామ్'లో ఆన్లైన్లో దాఖలు చేయవచ్చు.

సంపాదకీయం

ప్యాకేజి కంటితుడుపు చర్యే

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగబోదని స్పష్టమైన ప్రకటన చేయకుండా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నాన్చుతోంది. ఆ విధంగా ప్రకటన చేయించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అంతంతమాత్రమే. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్ ఉద్యోగులు, కార్మికులు, వామపక్ష పార్టీలు, ప్రజలు గత నాలుగు సంవత్సరాలుగా పెద్దఎత్తున చేస్తున్న ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం శుక్రవారం స్వల్పంగా స్పందించింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికంటూ రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలో "విశాఖ ఉక్కుకు ప్యాకేజీ" అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదిందని మోదీ అనుకూల మీడియా విస్తృత ప్రచారం చేసుకుంటుండగా, కార్మికసంఘాలు పెదవివిరుస్తున్నాయి. కేంద్రం నిర్ణయాన్ని అశ్వనీ వైష్ణవ్ ప్రకటిస్తూ, "ఇది భారీ పునరుద్ధరణ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి. ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. "దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ది కీలక పాత్ర" అని పేర్కొన్నారు. వినడానికి ఈ మాటలు చాలా బాగున్నాయి. కానీ, విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల ఎన్డీయే ప్రభుత్వ తీరు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉందనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు గత మూడేళ్లుగా మోదీ ప్రభుత్వం చేయని ప్రయత్నాలు లేవు. రాష్ట్ర ప్రజానీకం మద్దతుతో కార్మికులు అకుంఠిత దీక్షతో నిర్వహిస్తున్న ఆందోళన ముందు మోదీ ప్రయత్నాలు వెలవెలపోతున్నాయి. దానితో పథకం ప్రకారం స్టీల్ ప్లాంట్‌ను మోదీ ప్రభుత్వం నష్టాల్లోకి నెడుతోంది. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడానికి, సొంత గనులు సమకూర్చడానికి వెనుకాడుతోంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు మద్దతు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇంతకు ముందు అధికారంలో ఉన్న జగన్ మోహన్‌రెడ్డి విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కనీస ప్రయత్నం చేయడంలేదు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన రుణ భారం, తగినంత ముడిసరకు లేకపోవడం ఇతర సమస్యలు దీనికి అదనం. విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందులు తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇంతకుముందు పార్లమెంటు స్థాయీసంఘం ముందు చెప్పింది గానీ చర్యలు శూన్యం. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్థాయీ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు కూడా చేసింది. ఉత్పత్తిలో విశాఖ స్టీల్ ప్లాంట్ 120 శాతం రేటింగ్ సామర్థ్యంతో ప్రసిద్ధి చెందింది. గతంలో లాభాలు ఆర్జించింది. సొంత ఆర్థిక వనరులను ఉపయోగించి ఉత్పత్తి 3.4 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యానికి పెరిగింది. మూలధన పెట్టుబడి, ముడిసరుకు సరిపడినంత సమకూర్చకపోవడంతో ప్రస్తుతం 50శాతం సామర్థ్యంతోనే నడుస్తోంది. ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా పునరుద్ధరిస్తే వీలైనంత తొందరగా లాభాల్లోకి వస్తుంది. దీనికోసం వెంటనే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటుచేసి, అవసరమైన బ్యాంకు రుణాలు తీసుకునేందుకు లెటర్ ఆఫ్ కంఫర్ట్ జారీ చేయాల్సిన అవసరం ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంటుకు మినహా దేశంలో అన్ని ఉక్కు కర్మాగారాలకు క్యాప్టివ్ మైన్స్ ఉన్నాయి. ప్లాంటు నిరంతరం పనిచేయడానికి, వీలైనంత ఎక్కువ బఫర్‌స్టాకును ఉంచుకోవడానికి వీలుగా వెంటనే ఇనుప ఖనిజం గనులను కేటాయించాల్సిన అవసరం ఉంది.

స్టీల్ ప్లాంట్ కు సొంతంగా గనుల కేటాయించడం అవసరం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను కూటమి నేతలు నిలబెట్టుకోవాలి. ప్యాకేజీ అనేది కంటి తుడుపు చర్యే. స్టీల్‌ప్లాంట్ సమస్యలకు అది ఎంత మాత్రం శాశ్వత పరిష్కారం కాదు. ఇచ్చిన ప్యాకేజీ రెండు మూడు నెలలకు మించి సరిపోదు. ప్యాకేజీలతో ఒరిగేదేం లేదు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం క్యాపిటివ్ మైన్స్ కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే మార్గం. ముడి సరుకు కొనుగోలుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కార్పొరేట్ల ఒత్తిడి మేరకే ఈ ప్యాకేజి ప్రకటించారన్న విమర్శలు లేకపోలేదు. ప్యాకేజీ మొత్తం బకాయిలకే సరిపోతుంది. స్టీల్ ప్లాంట్‌కు రూ.17 వేల కోట్లు అప్పులున్నాయని చెపుతున్న ప్రభుత్వం ప్యాకేజ్ పేరుతో కేవలం రూ.11,500 కోట్లు కేటాయించడం వల్ల సమస్య ఎలా పరిష్కారం అవుతుందో కేంద్రానికే తెలియాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకుని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ గత 1500 రోజులకు పైగా స్టీల్ ప్లాంట్ వద్ద కార్మిక సంఘాలు, ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వంద శాతం వాటాలు విక్రయించాలని 2021 ఫిబ్రవరిలో కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. కార్మికుల, ఉద్యోగుల మనోభావాలను పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకు, నిధులు రాకుండా చేసి పరిశ్రమను నష్టాలపాలు చేసి విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి దానికి అదే మూతపడేటట్లు చేసే కుట్రలో భాగంగా బ్లాస్టు, ఫర్నిసు, ముడి సరుకు సరఫరా చేయకుండా కేంద్రం ఇబ్బంది పెడుతోంది. ఎన్నికలకు ముందు చంద్ర బాబు, పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుచేస్తామని చెప్పిన మాటలు ఎన్నికల తరువాత నీటిమూటలుగా మారిపోయాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడి ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించేలా చేస్తాను 45 రోజులు గడువు ఇవ్వాలని కోరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆ గడువు దాటి చాలా రోజులు అయినా నోరు మెదపడంలేదు. విశాఖపట్నంలో ఈ నెల8న నిర్వహించిన బహిరంగ సభలో అయినా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ ప్రస్తావన చేస్తారని అందరూ భావించారు. సభలో ప్రధాని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముగ్గురు ఒకరినొకరు పొగుడుకోవడమే సరిపోయింది తప్ప రాష్ట్ర ప్రజలు, విశాఖ ప్రజలు ఎంతో ఎదురుచూసిన స్టీల్‌ప్లాంట్ గురించి ఒక్కముక్క కూడా ప్రస్తావించలేదు. కేంద్ర ప్రభుత్వం కంటితుడుపు చర్యలు కాకుండా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఈ ప్లాంట్‌కు క్యాపిటివ్ మైన్స్ కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకుని, ప్లాంట్‌కు కావాల్సిన అన్నింటిని సమకూర్చే వరకూ కార్మికసంఘాలు ఉక్కుసంకల్పాన్ని ఏమాత్రం సడలించకుండా మొక్కవోని దీక్షతో పోరాటం కొనసాగించాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బతికించుకొని సొంత గనులు కేటాయిస్తే ఇప్పుడున్న ఉద్యోగాల కంటే అదనంగానే వస్తాయి.

'సారీ'ల ... ప్రభుత్వమిది... 'సారీ'

ప్రేమాభిషేకం సినిమా గుర్తుందా..!? అందులో ఓ పాట "వందనం... అభివందనం" గుర్తుందా..!? ఆ పాటలో హీరో ఏఎన్నార్ హీరోయిన్ జయసుధపై పడుతూ రెండు మూడుసార్లు 'సారీ" చెబుతాడు. అలా ఉంది రాష్ట్రంలో ఏలికల తీరు. సారీ ఇలా అంటున్నందుకు. ఇంతకీ ఆ తిరుమల దుర్ఘటన తర్వాత క్షమాపణలు సరే ఆ కలియుగ దైవాన్ని దర్శించుకోవడానికి వచ్చిన వారి శరీరాలు ఏవీ. ఆ తొక్కిసలాటలో మరణించిన వారి బృహత్ శరీరాలు కావాలి నాకు. దైవ దర్శనం సరే, క్షమాపణలు సరే, నవ్వుతూ.. నవ్విస్తూ... కష్టాలకు కరుగుతూ... ముక్కోటి దేవతలకు మొక్కుతూ కాలం గడిపే ఆ శరీరాలు కావాలి నాకు. తెచ్చిస్తారా...!? పరామర్శలు, పలకరింపులు, గద్దింపులు, గదమాయింపులు, ఓదార్పులు, రాజకీయ ప్రసంగాలు సరే. నాకు ఆ శరీరాలు కావాలి. ఇంకేం వద్దు. ఆ తొక్కిసలాటలో తనువు చాలించిన వారి శరీరాలు కావాలి. అధికారులను బాధ్యులను చేసి బదిలీలు చేశారు. సరే. మరీ ఆ శరీరాలు ఏవీ. అవి కావాలి నాకు. అలా నడుచుకుంటూ తిరుమల వెళ్లిన వారు మూటలుగా వచ్చారు కదా..!? ఆ శరీరాలు కావాలి. క్షమించండంటూ చేతులెత్తిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... మంత్రాలకు చింతకాయలు రాలతాయా అన్నట్లు క్షమాపణలు చెబితే పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా అని లాజిక్కులు తీసిన వారి స్టేట్‌మెంట్లు సరే... నాకు శరీరాలు కావాలి. తీసుకురాగలరా... !? అన్నదే నా ప్రశ్న.

ఆరు మాసాలైనా కాలేదు అప్పుడే అన్నీ ఇచ్చేస్తామా అంటున్న ఏలికలకు ఈ సారీ పదం తప్ప మరింకేమి మిగలనందుకు ప్రజలు

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

సారీ చెప్పాల్సిందేనా...!? గ్యారంటీ అని చెప్పిన ఆరు పథకాలు అంతే గ్యారంటీగా అటకెక్కాయా అని ప్రశ్నించినందుకు ప్రజలే సారీ చెప్పాలా..!? పొరుగున ఉన్న మీ శిష్యుడు ఇస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం ఇంకా తీసుకురాలేకపోయినందుకు, ఆ బస్సులో ఉచితంగా ఎక్కనివ్వడం లేదు అన్నందుకు ఆ మహిళలే సారీ చెప్పాలా..!? ఓట్ల వేటలో ఉచితానుచితాలు లేకుండా ప్రకటించిన పథకాలు ఇంకా అమలులోకి రానందుకు క్షమాపణలు... అదే సారీ ఎవరికి వారే చెప్పుకోవాలా..!? భక్తుల్ని శవాలుగా చూడాల్సి వస్తున్నందుకు ఎవరికి ఎవరు క్షమాపణలు చెప్పాలో అర్థంకాని స్థితిలోకి వచ్చినందుకు మాకు మేమే మరోసారి సారీ చెప్పుకోవాలా...!?

పోలవరానికి నిధులు, రైల్వే ప్రాజెక్టుల కోసం వినతులు... అన్నట్లు మరచిపోలేదు. వీటన్నింటికి ఒకే ఒక్కసారి క్షమాపణలు చెబితే సరిపోతుందా...!? లేక ఒక్కోదానికి విడివిడిగా క్షమాపణలు చెప్పాలా...!? అసలు క్షమించండి అనే పదం లేకుండా ఏలికలకు రోజు గడుస్తుందా!? బెల్టు షాపుల ముందు క్యూలు కడుతున్న వారి బెల్టు తీయలేకపోతున్నందుకు ఓ సారి చెప్పేస్తే పోలే అంటారా... నీకు పదిహేను, నీకు పదిహేను, నీకు పదిహేను... ఇదిగో ఇప్పుడే వచ్చిన ఈ పిల్లకి కూడా పదిహేను అని పాలకొల్లు నాయుడు గారు మంత్రి కాకముందు అప్పచెప్పిన పాఠం ఎన్నికల తర్వాత మరచిపోయినందుకు ఆ చిన్నారులు, వారి తలిదండ్రులు సారీ చెప్పాలా. పద్నాలుగున్నర సంవత్సరాల ముఖ్యమంత్రి అనుభవం, నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ఆ పెద్దాయన తన ఏలికలో కొత్తగా ఈ క్షమాపణ పర్వానికి తెర తీస్తున్నందుకు ఎవరు ఎవరికి సారీ చెప్పాలో... ప్లీజ్ కాస్త వివరిస్తారా...!? ఎన్నికల వేళ ఎగిసిపడి కుడి చేత్తో ఎడమ వైపు మెడను రుద్దుకుంటూ ముఖంపై పడుతున్న ముంగురులను మాటిమాటికి పైకి ఎగదోసి ఆవేశకావేశాలు ప్రదర్శించిన హీరోగారు సారీ తప్ప మరింకేం చేయలేకపోతున్నందుకు ఆయనికి సారీ చెప్పాలా..!? అమ్మ ఒడిని జాగ్రత్తగా చీర మడత పెట్టినట్లుగా మడత పెట్టి లెక్కల ఎక్కాలు వచ్చాక దాని సంగతి చూద్దామన్న భవిష్యత్ సీఎంకు సారీ చెప్పాలా.

"సీజ్ ద షిప్" అంటూ అధికారులను ఆదేశించి, ఆనక ఆ షిప్పు ఏలికల వియ్యంకులదని తెలిశాక తనకు తానే "సీజ్ ద మౌత్" అయినందుకు కూడా క్షమాపణలు ఎవరు చెప్పాలో ఈ బండ బుర్రకి తోచడం లేదు. పాలన కాకుండా ఆనాటి ఏలికలను తిడుతూ చీటికి మాటికి వైరిభక్తి ప్రదర్శిస్తున్న నేటి ఏలికల తీరుకు ఎవరికి సారీ చెప్పాలి. ఏమిటో అంతా గందరగోళంగా ఉంది. ఈ సారీల తీరుతో సారీ అనే మాట, దానికి అర్థం తప్ప ఏ పత్రిక తిరగేసినా, ఏ చానల్ చూసినా మరింకేదీ కనిపించకపోవడం... లేదూ చూపించకపోవడం మీడియా చేస్తున్న పనిగా భావించి వారికి కూడా సారీ చెప్పాలనిపించడం తప్పు కాదని ఎందుకో నాకు అనిపిస్తోంది. చివరిగా... ఇలా రాయాల్సి వస్తున్నందుకు, ఇలా రాయకుండా ఉండలేని తనానికి కూడా నాకు నేనే క్షమాపణలు చెప్పుకుంటూ...

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

వెంటాడే నిరుద్యోగం

డా. బాలచంద్ర కాంగో

పెట్టుబడీదారీ ఆర్థికవ్యవస్థలో కార్మికుడికి ఎల్లవేళలా నిరుద్యోగం ఎదురు చూస్తూనే ఉంటుంది. అన్ని రకాల ఉద్యోగాలలో ఏదైనా ఊడిపోవడంపై ఆందోళన వెంటాడుతూనే ఉంటుంది. నిరుద్యోగులు గేటు దగ్గర వేచి చూస్తూనే ఉంటారు. వీరు ఈ వ్యవస్థను సవాలు చేస్తారు. అందరికీ ఉద్యోగాలు ఏ రోజు లభించవు. ఉద్యోగం పోతుందనే భయంతో కార్మికుడు ఎంత తక్కువ వేతనం ఇస్తే దానికి పనిచెయ్యడానికి సిద్ధంగా ఉంటాడు. పెట్టుబడీదారీ ఆర్థిక వ్యవస్థలో యజమాని అధిక లాభం పొంది వేతనాలు తక్కువ ఇవ్వడం అవసరమను కుంటాడు. నిరుద్యోగం ఒక దశకు మించితే దాన్ని అంగీకరించడం సాధ్యం కాదు. అమెరికా, ఐరోపాలలో రోజూ నిరుద్యోగం తలెత్తుతున్నందున టెలివిజన్ నెట్ వర్కులో పనిచేస్తారు.

ఇటీవల ఆర్థిక ధోరణులు నిరుద్యోగ పరిస్థితులను మార్చివేస్తున్నాయి. ఉద్యోగానికి సంబంధించిన గణాంకాలలో స్వయం ఉపాధి ఉంది. దీన్ని మరింత పరిశీలించవలసిన అవసరం ఉంది. సేవలరంగం జీడీపీలో భాగంగా పెరుగుతుంది. కాంట్రాక్టు ఉద్యోగులు, స్వయం ఉపాధి కార్మికులు పెరుగు తున్నారు. ఈ తరగతికి చెందిన ప్రజల జీవనప్రమాణం, సామాజిక భద్రత చాల కీలకంగా మారింది. 1917 మహత్తర సోషలిస్టు విప్లవం తర్వాత సంఘటితరంగ కార్మికులు ఏర్పడ్డారు. అయితే వారి పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. పోరాటాల ద్వారా ట్రేడ్‌యూనియన్లు ఏర్పాటుచేయడం, 8గంటల పనిదినం, కనీస వేతనాలను సాధించడం లాంటి హక్కులను అనేకం సాధించారు. 1929-30లలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడీదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో పడింది. అయితే ఈ సందర్భంలో సోవియట్‌యూనియన్‌లో మాంద్యం ఏర్పడలేదు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించారు. సోషలిస్టు ప్రపంచంలో మార్కెట్ కూడా రక్షించబడింది. పెట్టుబడీదారీ వ్యవస్థ సంక్షేమ ఆర్థిక విధానాలను ఇంకా ఇతర ముఖ్యమైన అనుభవాలను నేర్చుకుంది. మనకు ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, వేతనాల పెరుగుదల వివిధ చట్టాలను ప్రవేశపె ట్టడం జరిగింది. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఈఎస్ఐసి, డీఏ అలవెన్స్, నిరుద్యోగ బీమా, పరిశ్రమలు మూతపడకుండా రక్షణలు కల్పించడం మనం అనుసరించాం.

కార్మికుల పోరాటాల మూలంగా ఈ అభివృద్ధి సాధ్యమైంది. అనంతరం కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టడం, సోషలిస్టు దేశాలు బలహీనపడటం, నూతన ఆర్థిక విధానాలను అమలుచేయడం, ట్రేడ్ యూనియన్ల పటిమ, ప్రభుత్వరంగం గణనీయంగా తగ్గిపోయాయి. అయితే అంతక్రితం కార్మికులు అనేక ప్రయోజనాలను అనుభవించారు. ఆ తర్వాత క్రమంగా ఆ ప్రయోజనాలను ఉపసంహరించుకున్నారు. ఉదాహరణకు భారతదేశంలో 44 కార్మిక చట్టాలను ఉపసంహరించి నాలుగు కోడ్‌లను చేశారు. వీటిని చట్టాలని అంటాం. ఈ కొత్తగా చేసిన చట్టాలు యజమానులకు అనుకూలంగా ఉంటాయి. ఆర్థిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఈ చట్టాలు లేవు. పారిశ్రామిక, ఆర్థిక రంగానికి సామాజిక భద్రత, శాశ్వత ఉద్యోగం, అత్యంత ప్రాముఖ్యమైనవి. అయితే, ఆర్థిక పెట్టుబడి పెరగడంమూలంగా పునాది మారిపోయింది. ప్రస్తుతం సామాజిక భద్రత కేవలం కొన్ని గ్రూపుల కార్మికులకు మాత్రమే ఉంది. ఉద్యోగ భద్రత తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. కృత్రిమ మేధ(ఏఐ), రోబోటిక్స్ ప్రవేశం ఉద్యోగ పరిస్థితి మరింతగా మార్చివేసింది. భవిష్యత్తులో ఏఐ బాగా వేతనాలు చెల్లించే పోస్టులను లేకుండా చేయవచ్చు. ఎకౌంటెట్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, న్యాయనిపుణుల పోస్టులకు

> **1929-30లలో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడీదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో పడింది. అయితే ఈ సందర్భంలో సోవియట్‌యూనియన్‌లో మాంద్యం ఏర్పడలేదు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించారు. సోషలిస్టు ప్రపంచంలో మార్కెట్ కూడా రక్షించబడింది. పెట్టుబడీదారీ వ్యవస్థ సంక్షేమ ఆర్థిక విధానాలను ఇంకా ఇతర ముఖ్యమైన అనుభవాలను నేర్చుకుంది. మనకు ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, వేతనాల పెరుగుదల వివిధ చట్టాలను ప్రవేశపెట్టడం జరిగింది**

ప్రమాదం కలుగుతుంది. మధ్య తరగతి, నైపుణ్య కార్మికులు తమకేమీ ప్రమాదం లేదని భావించినప్పటికీ, ప్రస్తుతం వారి ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుంది. ఇటీవల ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ ఒక ఇంటర్వ్యూలో పెరుగుతున్న అసమానతలపై ప్రముఖంగా ఆందోళన వ్యక్తం చేశారు. పనిదినం అధిక గంటలు ఉండాలని డిమాండ్ చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. ఇన్ఫోసిస్ కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కార్మికులు వారానికి 70గంటలు పనిచేయాలని సూచించగా, ఎల్అండ్ టి కంపెనీ సీఈఓ సుబ్రహ్మణ్యన్ వారానికి 90గంటలు పనిచేయాలని కోరారు. వీరు ఉద్యోగులకు అధిక వేతనాలు ఇవ్వడానికి మాత్రం ముందుకురారు. సీఈఓలకు, ఉన్నతస్థాయి ఎగ్జిక్యూటివ్ అధికారులకు ఇటీవల సంవత్సరాల్లో ఇతర ఉద్యోగులకంటే 600శాతం అధికంగా వేతనాలను పెంచారు. ఫలితంగా అసమానత పెరిగింది. ఆర్థికరంగంలో వినిమయం తగ్గిపోయింది.

19వ శతాబ్దిలో 8గంటల పనిదినాన్ని దీర్ఘకాలపోరాటం అనంతరం సాధించారు. ఈ కాలంలో ట్రేడ్‌యూనియన్ ఉద్యమం గణనీయమైన విజయాలను సాధించింది. మే 1వ తేదీ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవంగా గుర్తించారు. కార్మికుల పోరాటానికి ఇది గొప్ప చిహ్నం. కార్మికులు తమ డిమాండ్‌ను సాధించుకునేందుకు జరిపిన పోరాటంలో విద్యుత్తు జనించడం కీలకపాత్ర వహించింది. పనిగంటలను 8నుంచి 6కు తగ్గించాలని, నిరుద్యోగాన్ని తగ్గించాలని, వృద్ధిని పెంచాలని, ఉద్యోగాలు పెంచనవసరంలేదనే చర్చకూడా జరుగుతోంది. అయితే దుందుడుకువాద పెట్టుబడీదారీ విధానం ప్రస్తుత శతాబ్దంలో ఎక్కువ గంటలకోసం డిమాండ్ చేస్తోంది. వాస్తవంగా భారతదేశంలో ఇతర అభివృద్ధిచెందుతున్న దేశాల్లో ఇతర అనేక పారిశ్రామిక రంగాలలో రోజుకు 12గంటలు పనిచేయడం ఇటీవల సాధారణమైంది. ప్రపంచవ్యాప్తంగానే పనిపరిస్థితులు దిగజారుతున్నాయని, పనిభారం పెరిగిందని ఐఎల్ఓ తెలియజేసింది. అనేకమంది ఆర్థిక వేత్తలు నాణ్యమైన ఉద్యోగాలను పరిగణలోకి తీసుకోవాలని ఉద్యోగాల విషయమై చర్చించేటప్పుడు మాట్లాడుతున్నారు. శాశ్వత ఉద్యోగాలకంటే అనేకమంది స్వయం ఉపాధిని కోరుతున్నారని తెలిపారు. కార్మికులు ఉద్యోగ భద్రతకోసం జీవించడానికి తగిన వేతనాలకోసం, సామాజిక భద్రతకోసం పోరాటం చేశారు. జాబ్ మార్కెట్‌లో స్వయం ఉపాధి ఇప్పుడు ప్రముఖమైన అంశంగా మారింది. ఈ విషయాన్ని ట్రేడ్‌యూనియన్లు చర్చించవలసిన అవసరంఉంది. 60ఏళ్లు దాటినవారికి పెన్షన్ చెల్లింపు పరిష్కారంగా ఒక ప్రతిపాదన ముందుకువచ్చింది. సార్వత్రిక పెన్షన్‌లు, ఆరోగ్యప్రయోజనాలు చెల్లించదగిన ప్రభుత్వ రావాణా ఖరీదు, ప్రభుత్వరంగంలో విద్య, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలనే ప్రతిపాదన వస్తోంది. పెట్టుబడిదారులు ట్రేడ్‌యూనియన్లను లక్ష్యంగా చేసుకుని, లాభాలను మరింత పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ ముఖ్యమైన అంశాన్ని గుర్తించవలసి ఉంది.

తెలంగాణాలో సీపీఐ ఆవిర్భావం

ఆర్వీ రామారావ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 1956లో ఏర్పడే దాకా తెలుగు మాట్లాడే ప్రజలు భిన్న రాజకీయ వ్యవస్థల్లో భాగంగా ఉన్నారు. కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉండేవి. మరో వేపు తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రజలు నిజాం ఏలుబడిలో ఉండేవారు. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడక ముందు నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానంలో ప్రస్తుత మహారాష్ట్రలోని ఔరంగాబాద్, భీడ్, నాండేడ్, ఫర్బని జిల్లాలు, కర్నాటకలోని బీదర్, గుల్బర్గా, ఉస్మానాబాద్, రాయచూర్ ప్రాంతాలు కూడా ఉండేవి. అంటే మూడు భాషలు మాట్లాడేవారు హైదరాబాద్ సంస్థానంలో ఉంటే అందులో 80 శాతం పైగా తెలుగు మాట్లాడేవారే. కానీ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు తెలుగును ఉపేక్షించడమే కాకుండా తెలుగు రాయడం, చదవడం అంటే కిట్టేది కాదు. మొత్తం హైదరాబాద్ లోకెల్లా తెలుగు మాధ్యమం ఉన్నది ఒకే ఒక్క పాఠశాల. చదువంతా ఉర్దూ మీడియంలోనే. నిజాం పాలించిన ప్రాంతంలో తెలుగును కాపాడుకున్నది గ్రామీణులే. అంటే కోస్తా ఆంధ్ర ప్రాంతం వారు తమ భాషా సంస్కృతులను కాపాడుకోవడానికి తమిళులతో పోరాటం చేయాల్సి వస్తే తెలంగాణ ప్రాంత వాసులు నిరంకుశ నిజాంతో పోరాడవలసి వచ్చింది. భాషా సంస్కృతుల పరిరక్షణ కోసమే కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 1913లో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ప్రతి ఏటా ఈ మహాసభలు 1913 నుంచి ప్రారంభించి 1951 దాకా జరిగాయి. వీటికి తోడు మామూలుగా జరిగే మహాసభలు కాకుండా 1918, 1931, 1934, 1947 లో ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించేవారు.

ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే తెలంగాణాలో రాజకీయ చైతన్యంతో పాటు, భాషా-సంస్కృతుల పరిరక్షణోద్యమం కూడా ఆలస్యంగా మొదలైంది. దీనికి ప్రధానమైన కారణం నిజాం నిరంకుశత్వం. సభలు సమావేశాల్లో కన్నడంలోనో, మరాఠీలోనో మాట్లాడడానికి అనుమతి ఉండేది కానీ తెలుగులో మాట్లాడడానికి వీలే ఉండేది కాదు. 1921లో ఒక సభలో ఆలంపల్లి వెంకట రామారావ్ తెలుగులో మాట్లాడితే గేలిచేసి ఆయనను మాట్లాడనివ్వకుండా చేశారు. దీనికి నిరసనగానే ఆంధ్ర జనసంఘం ఏర్పడింది. అదే క్రమంగా 1930లో ఆంధ్రమహాసభగా పరిణామం చెందింది. ఆంధ్ర మహాసభలో కూడా రాజకీయాల ఊసు ఉండకూడదని నిజాం హుకుం. 1937 లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్ర మహాసభలో మాత్రం రావి నారాయణ రెడ్డి, మందుముల రామచంద్రరావు ప్రోద్బలంతో నిజాం రాష్ట్రంలో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలని తీర్మానించారు. తెలంగాణ ఆంధ్ర మహాసభలో రాజకీయ తీర్మానం చేయడం ఇదే మొదలు. నిజాం హయాంలో రాజకీయ

కార్యకలాపాలకు తావే ఉండేది కాదు. కోస్తా ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ లో పని చేస్తూ తరవాత కమ్యూనిస్టులుగా మారారు. తెలంగాణాలో సమాజం గురించి ఆలోచించడానికి ఆర్య సమాజం బాగా ఉపయోగపడింది. అనేకమంది కమ్యూనిస్టు నాయకులు ఆర్య సమాజంలో పని చేస్తూ కమ్యూనిస్టులైన వారే.

నిజాం నవాబు చిరంజీవిగా వర్ధిల్లాలని ప్రార్థన చేయాల్సి వచ్చేది. కానీ తిరుగుబాటు తత్వం ఉన్న వారు నిజాంను కీర్తించే ప్రార్థనకు బదులు వందేమాతరం ఆలపించేవారు. అందులో సోషలిస్టు భావాలు ఉన్న వారు కూడా ఉండేవారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, సర్వదేవభట్ల రామనాథం అలాంటి వారే. మరో వేపు కమ్యూనిస్టు భావాలు విస్తరించడం మొదలైంది. కాంగ్రెస్ పార్టీనే నిషేధించిన నిజాం హయాంలో కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ సంస్థానంలో పని చేయడం ఊహకు కూడా అందని విషయం. కమ్యూనిస్టు భావాలున్న మఖ్దూం మొహియుద్దీన్, డా.రాజ్ బహదూర్ గౌర్, ఆలం కుందుమిరి, జవాద్ రజ్వీ లాంటి వారు 1939లో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. నిజానికి ఇది కమ్యూనిస్టు పార్టీకి మారు రూపమే. ఆంధ్ర మహాసభ కార్యకలాపాలలో వీరు పాల్గొనే వారు. ఆంధ్రమహాసభపై కామ్రేడ్స్ అసోసియేషన్ ప్రభావం చాలా ఉంది. దీనికి బూర్గుల రామకృష్ణారావు సహకారం ఉండేది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ కామ్రేడ్స్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించింది. జవహర్ లాల్ నెహ్రూ రచనల ప్రభావంతో ఆంధ్ర మహాసభలో పని చేస్తున్న రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి, ఆరుట్ల లక్ష్మి నరసింహా రెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డి సోషలిస్టు భావాలకు లోనయ్యారు. మహారాష్ట్ర పరిషత్తుతో సంబంధం ఉన్న చంద్రగుప్త చౌదరి, వి.డి.దేశ్ పాండే, హబీబుద్దీన్ కూడా సోషలిస్టు భావాలతో ప్రేరణ పొందారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో యువకులలో పత్రికలు చదవాలన్న ఆసక్తి పెరిగింది. ఫాసిజం, కమ్యూనిజం, రష్యా విప్లవంలాంటి అంశాలు యువకుల ఆలోచనలను ఆవరించాయి. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న వారిలో సోషలిస్టు భావాలు అంకురించిన వారు, కామ్రేడ్స్ అసోసియేషన్ నెలకొల్పిన వారు, ఆంధ్ర మహాసభలో పనిచేస్తున్న రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల సోదరులు కలిసి 1939 చివరలో నిజాం సంస్థాన కమ్యూనిస్టు కమిటీ అవతరించింది. ఆ రోజుల్లో సీపీఐ శాఖల్లోకెల్లా బలీయమైందనుకునే ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ చొరవతో నిజాం సంస్థానంలో కమ్యూనిస్టు పార్టీకి వ్యవస్థా రూపం వచ్చింది.

"నెహ్రూ గారి పుస్తకాలు చదవడం వల్ల కొందరు యువకుల్లో సోషలిస్టు భావాలు అలవడ్డాయి. అంతర్జాతీయంగా సోవియట్ యూనియన్‌లో రెండు పంచవర్ష ప్రణాళికల విజయం, నూతన సమాజ ప్రగతి అనేక మందిని సోషలిస్టు భావాలకు అనుగుణంగా మార్చాయి.

ఆంధ్రమహాసభ

అంతకు ముందే పెట్టుబడిదారీ ప్రపంచంలో వచ్చిన ఆర్థిక సంక్షోభ ఛాయలు సోవియట్ యూనియన్‌కు సోకలేదు. పైగా అక్కడ నిరుద్యోగం పూర్తిగా నిర్మూలమైంది. ఆర్థిక పరిస్థితి నానాటికీ మెరుగుపడుతున్నది. పెట్టుబడిదారీ ప్రపంచానికి, సోవియట్ యూనియన్‌కు గల ఈ మౌలిక తారతమ్యం మాలో ఉత్సాహాన్ని పురికొల్పేది. అలాంటి సమాజాన్ని నిర్మించుకునే అవకాశాన్ని మనం కూడా ఉపయోగించుకోవాలని మేమనుకుంటూ ఉండేవారం. ఇలా సోషలిస్టు భావాలు పరుగులు పెట్టే యువకులతో ఆనాడు నిజాం రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ ఏర్పడింది" అని రావి నారాయణ రెడ్డి తన "వీర తెలంగాణా: నా అనుభవాలు జ్ఞాపకాలు" లో రాశారు.

తెలంగాణ సాయుధ పోరాటం వెనక ఇంత పూర్వ రంగం ఉంది.

'సుప్రీం'లో ఆప్ సర్కార్‌కు ఊరట

ఆయుష్మాన్ భారత్ ఎంఓయూపై స్టే

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆప్ సర్కారుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించిన ఎంవోయూపై ప్రభుత్వం సంతకాలు చేయాలన్న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. బలవంతంగా సంతకం చేయించడం ఏమిటన్న ప్రభుత్వ వాదనతో ఏకీభవిస్తూ... నిలుపుదల ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి 5వ తేదీకల్లా దేశ రాజధానిలో ఈ పథకం ప్రవేశపెట్టేందుకు అవసరమైన ఎంవోయూపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంతకాలు చేయాలని డిసెంబరులో ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఆప్ సర్కార్ పిటిషన్ వేసింది. విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసిహ్‌తో కూడిన ధర్మాసనం... శుక్రవారం హైకోర్టు ఆదేశాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేసమయంలో కేంద్ర ప్రభుత్వం, ఎయిమ్స్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లకు ఈ పిటిషన్‌పై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కాగా, ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కేంద్రం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఢిల్లీలోనూ దీనిని ప్రవేశపెట్టాలని చూసింది. అయితే దేశ రాజధానికి దీని అవసరం లేదని, ఇక్కడి ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారని ఆప్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాజకీయ దుమారం రేపింది. దీనిపై బీజేపీ ఎంపీలు హైకోర్టులో పిటిషన్ వేయగా... పథకాన్ని వర్తింపజేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే సుప్రీంకోర్టులో ఆ ఆదేశాలకు బ్రేకులు పడ్డాయి. సుప్రీంకోర్టులో ఆప్ ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పథకం వివరాలేమిటంటే... పేద, ధనిక తారతమ్యం లేకుండా దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం కల్పించడమే ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన ఉద్దేశం. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఆరు కోట్లమంది వృద్ధులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందుతారు. అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్యబీమా లభిస్తుంది. ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లపైబడిన వారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది.

సీజీహెచ్‌ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పథకాల కింద ఉన్న వయోవృద్ధులు వాటిని గానీ, ఏబీపీఎంజేఏవైని గానీ ఎంపిక చేసుకోవడానికి వీలుంది. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందడానికి అర్హులుగా కేంద్రం నిర్ణయించింది.

విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

ఆప్ అధినేత కేజ్రీవాల్ మరో హామీ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు 'ఉచిత' హామీల జోరు కొనసాగుతోంది. ఈ దిశగా 'ఆమ్ ఆద్మీ పార్టీ' మరో హామీ గుప్పించింది. తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించింది. సిటీలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఆప్ ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్న తమ పార్టీ తిరిగి ఎన్నికల్లో గెలిస్తే విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేందుకు బస్సు చార్జీలు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులకు బాసటగా నిలుస్తామని శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

ప్రధానికి కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఢిల్లీలోని పార్టీలన్నీ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేలా ముందుకు సాగుతున్నాయి. అందులో భాగంగా ప్రధాని నరేంద్రమోదీకి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం లేఖ రాశారు. దేశ రాజధాని పరిధిలోని మెట్రో రైళ్లలో ప్రయాణించే పాఠశాల, కళాశాల విద్యార్థులకు 50 శాతం టికెట్ రాయితీ అమలు చేయాలని కోరారు. రాయితీ కారణంగా పడే భారాన్ని రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో భరించాలని ప్రతిపాదన చేశారు. 'ఢిల్లీ విద్యార్థులకు సంబంధించి ముఖ్యమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ లేఖ రాస్తున్నాను. విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులు మెట్రోపై ఆధారపడుతున్నారు. వారిపై ఆర్థికభారం తగ్గించడానికి 50 శాతం రాయితీ అందించాలని ప్రతిపాదిస్తున్నాను' అని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని ఆప్ పట్టుదలగా ఉండగా, ఈసారి ఎలాగైనా అధికార పగ్గాలు చేపట్టాలని బీజేపీ పావులు కదపుతోంది. బీజేపీ, ఆప్ రెండూ ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటున్నందున కాంగ్రెస్ పార్టీనే ప్రత్యామ్నాయం అంటూ ఆ పార్టీ ప్రచారం సాగిస్తోంది. ఫిబ్రవరి 5న ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

గర్భిణీలకు రూ.21 వేలు

ఢిల్లీ బీజేపీ మేనిఫెస్టోలో వరాల జల్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టోను శుక్రవారం ప్రకటించింది. 'సంకల్ప పత్ర' పార్ట్-1 పేరుతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ మేనిఫెస్టో ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే గర్భిణీలకు రూ.21 వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్పీజీ సిలిండర్లను రూ.500కే ఇస్తామని పేర్కొన్నారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వీటితోపాటు ప్రస్తుతం ఉన్న అన్ని సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. గర్భిణీలకు రూ.21 వేల ఆర్థిక సాయం. ఆరు పౌష్టికాహార కిట్లు, ప్రస్తుతం ఇస్తున్న మొదటి సంతానం సమయంలో రూ.5 వేలు, రెండో సంతానానికి రూ.6 వేలకు ఇవి అదనమని పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తామని, దీనికి అదనంగా రూ.5 లక్షల ఆరోగ్య కవరేజీ ఇస్తామన్నారు. పేద కుటుంబీలకు రూ.500లకే ఎల్పీజీ సిలిండర్, ప్రతి హోలీ, దీపావళి (ఒకటి చొప్పున) పండగల సమయంలో ఉచితంగా గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. 60-70 ఏళ్ల వయోవృద్ధులకు రూ.2500 పెన్షన్, 70 ఏళ్ల పైబడిన వారికి రూ.3000, జేజే క్లస్టర్లలో అటల్ క్యాంటీన్‌ల ఏర్పాటు. రూ.5కే భోజనం, సంక్షేమ పథకాల అమల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేస్తామని జేపీ నడ్డా హామీ ఇచ్చారు.

కంగనా 'ఎమర్జెన్సీ'పై పంజాబ్‌లో నిరసన

చండీగఢ్: సినీ నటి కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని విడుదల చేయవద్దంటూ శుక్రవారం పంజాబ్‌లో సిక్కులు ఆందోళనకు దిగారు. అమృత్‌సర్‌లోని ఓ సినిమా హాల్ వద్ద భారీ సంఖ్యలో ఎస్‌జీపీసీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఎమర్జెన్సీ చిత్రంపై బ్యాన్ విధించాలని ఎస్జీపీసీ పంజాబ్ ప్రభుత్వాన్ని కోరింది. పంజాబ్‌లోని అన్ని సినిమా హాళ్లలో షోలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ చీఫ్ అమరిందర్ సింగ్ రాజా మాట్లాడుతూ... ఇటువంటి సినిమాలు తీసినప్పుడు, ఆ చిత్రాల్లో వాస్తవాలను వక్రీకరిస్తారని పేర్కొన్నారు. మసాలా లేకుండా సినిమా విజయవంతం కాదన్నారు. ప్రజలకు వినోదం పంచేందుకు ఇలాంటి సినిమాలు తీయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు, సెన్సార్ బోర్డులు ఇలాంటి చిత్రాలపై నిఘా పెట్టాలన్నారు. చిత్రంలో చూపించింది నిజం కాదు అని, అది కేవలం ఓ స్క్రిప్టు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. కాగా, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

పెట్టుబడులకు భారత్ స్వర్గధామం

భారత్ మొబిలిటీ ఎక్స్‌పో ప్రారంభిస్తూ మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి, మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని, మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు. మోదీ 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను శుక్రవారం ప్రారంభించారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందని మోదీ చెప్పారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8 వేల కోట్లకు పైగా సబ్సిడీ ఇచ్చామని ప్రధాని చెప్పారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఢిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని వెల్లడించారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలు కొనుగోలు చేయాలనుకుంటున్నారని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి అనేక ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. దేశ రాజధానిలోని భారత మండపంలో ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో... 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్- మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

కుంభమేళాలో కండల బాబా

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు రకరకాల సాధువులు నిత్యం విచ్చేస్తున్నారు. అయితే ఓ విదేశీ సాధువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆత్మ ప్రేమ్ గిరి మహారాజ్ అనే సాధువు తన చూపులతో అందరినీ కట్టిపడేస్తున్నారు. మస్క్యులార్ బాబా... కండల బాబాగా ఆయన్ని అందరూ పిలుస్తున్నారు. ఏడు అడుగుల ఎత్తు ఉన్న ఆ బాబా.. కాషాయం దుస్తుల్లో చాలా ధృఢంగా కనిపిస్తున్నారు. మెడలోను, చేయి కండరాల చుట్టూ రుద్రాక్షలు చుట్టి.. గంభీరమైన లుక్‌లో కనిపిస్తున్నాడు. ఆధునిక యుగానికి చెందిన పరశురాముడు అంటూ కొందరు అభివర్ణిస్తున్నారు. హిందూ మత పౌరాణికాల్లో పరశు రాముడికి ప్రత్యేక గుర్తింపు ఉంది. యోధుడి లక్షణాలతో అతడి శరీర నిర్మాణం ఉంది. వాస్తవానికి గిరి మహారాజ్‌ది రష్యా. 30 ఏళ్ల క్రితమే ఆయన హిందూ మతాన్ని స్వీకరించారు. అప్పటి నుంచి ఆ మత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఈయన ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ వృత్తిని వదిలేసిన ఆయన... ఆధ్యాత్మిక మార్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం గిరి మహారాజ్ బాబా నేపాల్‌లో ఉంటున్నాడు. జునా అకాడాలో సభ్యుడిగా కూడా ఉన్నాడు. హిందూ ధర్మ ఆచారాల్లో జునా అకాడాకు విశిష్టమైన స్థానం ఉన్నది. అయితే ఓ యూజర్ ఆ కండల బాబాకు చెందిన ఫోటోను తన ఇన్‌స్టాలో పోస్టు చేశాడు. ఆ బాబా ఫోటోకు తెగ లైక్‌లు వచ్చేస్తున్నాయి. హర్ హర్ మహాదేవ్ అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు.

కన్నడ పీసీసీ పదవిపై మాటల యుద్ధం

బెంగళూరు: కర్నాటక కాంగ్రెస్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో మరో మంత్రి మాటల యుద్ధానికి దిగారు. కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడి పోస్టుపై ఇద్దరు నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. దీంతో అధికార పార్టీ వ్యవహారంపై ప్రతిపక్ష బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధి స్తోంది. కన్నడ కాంగ్రెస్‌లో కలహాలు ఉధృతమయ్యేలా ఉన్నాయి. డిప్యూటీ సీఎంతో మరో మంత్రి మాటల యుద్ధానికి దిగారు. నాయకులు ఇష్టానుసారం మాట్లాడరాదని ఇటీవలే అధిష్ఠానం ఆదేశించినా పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ కేపీసీసీ అధ్యక్ష పదవి అంగడిలో దొరకదు. మీడియా ముందు మాట్లాడితే లభించదు. మనం పార్టీకి చేసిన సేవలు, శ్రమను గుర్తించి సరైన పదవి ఇస్తారని, కొంతమంది మీడియా ముందుకొచ్చి పదవి కోరుతున్నారని అన్నారు. పార్టీలో అందరూ క్రమశిక్షణ పాటించాలని రాహుల్‌గాంధీ, సీఎం సిద్దరామయ్య సూచించారన్నారు. కాంగ్రెస్ పార్టీని తానొక్కడే కాదు, కార్యకర్తలు, ప్రజలు కలిసి గెలిపించారన్నారు. ఈ వ్యవహారంపై మంత్రి సతీశ్ జార్కిహోళికి కేపీసీసీ నుంచి నోటీసులు వెళ్లాయి. మరోవైపు, కేపీసీసీ నుంచి నోటీసులు ఇచ్చినప్పటికీ ఏమీ కాదు, దీనికి స్పష్టమైన సమాధానం అధ్యక్షుడి ముందు ఇస్తానని మంత్రి సతీశ్ చెప్పారు. డీకేపై తరచూ విమర్శలు చేస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నోటీస్ ఇచ్చే అధికారం ఆయనకు ఉందన్నారు. కేపీసీసీ రేసులో ఉన్నానని తాను ఎక్కడా చెప్పలేదన్నారు. తన మాటలతో ఎవరికీ ఇబ్బంది లేదని, తాను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. మీడియా ఉదయం హీరోను చేసి, సాయంత్రం విలన్‌ను చేస్తుందని, ఇది సబబు కాదని చెప్పారు.

255 మంది అధికారులకు నోటీసులు

బళ్లారి: ప్రభుత్వ అధికారుల పనితీరుపై బళ్లారి జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా... వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మంది అధికారులపై 95 మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికీ జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణకు హాజరు కావాలని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఫిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్లారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి గుబులు పట్టుకుంది.

బస్సును ఢీకొన్న మినీ వ్యాన్... 9 మంది మృతి

ముంబై: ఆగి ఉన్న బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టడంతో తొమ్మిది మంది మృతి చెందిన ఘటన మహారాష్ట్రలోని పూణే జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలివి. పూణే-నాసిక్ హైవేపై నారాయణగావ్ వైపు వెళ్తున్న మినీ వ్యాన్‌ను శుక్రవారం ఉదయం టెంపో ఢీకొట్టింది.

దీంతో మినీ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఆగి ఉన్న ఖాళీ బస్సును బలంగా ఢీకొట్టింది. మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తొమ్మిది మంది మృతి చెందినట్టు నిర్ధారించారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

సామరస్యంగా పరిష్కరించుకోండి

తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్‌కు సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ: తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. లేనిపక్షంలో తాము జోక్యం చేసుకుని పరిష్కరిస్తామని పేర్కొంది. వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల (వీసీ) నియామకంపై సీఎం స్టాలిన్ ప్రభుత్వం, గవర్నర్ ఆర్.ఎన్. రవి మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. గవర్నర్ వీసీగా వ్యవహరించే అధికారాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో పాటు వివిధ నియామకాల్లో గవర్నర్ అధికారాలను పరిమితం చేసింది. అయితే ఈ బిల్లులను ఆమోదించడానికి గవర్నర్ నిరాకరించారు. కాగా, మద్రాస్ విశ్వవిద్యాలయం, భారతియార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్సలర్లను నియమించడానికి గవర్నర్ రవి ఒక కమిటీ ఏర్పాటు చేశారు. అయితే ఈ చర్య చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి సభ్యులను తొలగించడంతోపాటు ఆ కమిటీని పునరుద్ధరించింది. ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్బీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇరువురు కలిసి బిల్లుల పెండింగ్ వివాదాన్ని పరిష్కరించుకోవడం మంచిదని సూచించింది. లేనిపక్షంతో ఈ సమస్యను తాము పరిష్కరిస్తామని హెచ్చరించింది.

కర్నాటకలో వరుస దోపిడీలు

మంగళూరు బ్యాంకులో రూ.15 కోట్ల లూటీ

మంగళూరు: కర్నాటకలో వరుస దోపిడీలు హడలెత్తిస్తున్నాయి. బీదర్ ఘటన మరవకముందే మంగళూరులో మరో చోరీ జరిగింది. మంగళూరులోని ఉల్లాల్ కేసీ రోడ్డులో కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగులను గన్‌తో బెదిరించి ట్రెజరీలోని నగదు, బంగారం దొంగలు దోచుకెళ్లారు. రూ.15 కోట్ల నగదు, 5 లక్షల విలువైన నగలతో పరారయ్యారు. బ్యాంక్ సిబ్బంది భోజన సమయంలో దోపిడీ జరిగింది. ఐదుగురు దొంగలు చోరీకి పాల్పడ్డారని ఉద్యోగులు తెలిపారు. బీహార్ గ్యాంగ్ పనిగా అనుమానాలు వ్యక్తం చేశారు. దుండగులు ఫియట్ కార్‌లో వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. కాగా, గురువారం బీదర్‌లో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఏటీఎంకు డబ్బులు తరలిస్తున్న వాహనంపై దోపిడీ దొంగలు దాడి చేశారు. బైక్‌పై వచ్చిన దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు మృతి చెందారు. దాడి అనంతరం డబ్బు పెట్టెతో దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. అందులో రూ.93 లక్షల నగదు ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాడి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిని అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. దొంగలు తెలంగాణ వైపు వెళ్లినట్లు బీదర్ పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో పోలీసులు బీదర్ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. అఫ్జల్‌గంజ్ వద్ద దొంగలకు బీదర్ పోలీసులు కనిపించారు. దొంగల ముఠా తప్పించుకునేందుకు అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఓ ట్రావెల్స్ కార్యాలయంలోకి ప్రవేశించారు. పోలీసులపై కాల్పులు జరుపుతుండగా... అక్కడే ఉన్న ట్రావెల్స్ కార్యాలయం మేనేజర్‌కు బుల్లెట్లు తగిలాయి. దీంతో ఆయనకు తీవ్ర రక్తస్రావం జరిగింది. అప్రమత్తమైన హైదరాబాద్ పోలీసులు బీదర్ పోలీసులతో పాటు దొంగల ముఠాను పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

దొరకని దుండగుడు

గాలింపు ముమ్మరం

నిలకడగా సైఫ్ ఆరోగ్యం

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడికి పాల్పడిన నిందితుడిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నిందితుడు చివరిసారిగా బాంద్రా రైల్వే స్టేషన్ సమీపంలో కనిపించాడని పోలీసులు తెలిపారు. సైఫ్‌పై దాడి తర్వాత ఆ వ్యక్తి గురువారం ఉదయం లోకల్ రైలులో వాసాయి-విరార్ వైపు వెళ్లినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో వాసాయి, నల్లసోపారా, విరార్ ప్రాంతాల్లో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా విచారణ కోసం శుక్రవారం ఉదయం బాంద్రా పోలీస్ స్టేషన్‌కు ఓ వ్యక్తిని తీసుకొచ్చారు. అయితే ఆ వ్యక్తికి, సైఫ్ అలీఖాన్ దాడి కేసుతో సంబంధం లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని ముంబై పోలీసులు పేర్కొన్నారు. కాగా సైఫ్ అలీఖాన్ వెన్నెముకలో ఇరుక్కున్న హెక్సా బ్లేడ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ బృందాలు, డాగ్ స్క్వాడ్ సహాయంతో సైఫ్ అలీఖాన్ ఇంటివద్ద అనేక ఆధారాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిని గుర్తించడానికి ముంబైలోని అనేక ప్రదేశాలలో సోదాలు నిర్వహించామని వెల్లడించారు. సైఫ్‌పై దాడి జరిగినప్పుడు ఆయన అపార్ట్‌మెంట్ సమీపంలో ఎన్ని మొబైల్ ఫోన్లు క్రియాశీలంగా ఉన్నయన్న విషయాలను క్రైమ్ బ్రాంచ్, స్థానిక పోలీసులు సేకరించారు. కాగా, సైఫ్ పై దాడి జరిగి 30 గంటలకు పైగా గడిచాయి. 20పోలీసు బృందాలు నిర్విరామంగా పనిచేసినా నిందితుడి ఆచూకీ ఇప్పటివరకు కనిపెట్టలేకపోయాయి. పోలీసులు సేకరించిన సీసీ టీవీ ఫుటేజ్‌లో దాడి అనంతరం దుండగుడు మెట్ల మీదుగా పారిపోయినట్లు గుర్తించారు. గురువారం రాత్రి 2.33 గంటల సమయంలో ఆరో అంతస్తులోని మెట్లవద్ద నిందితుడి చిత్రాలు లభించాయి.

ప్రస్తుతం సైఫ్ పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు. అయితే సైఫ్‌ను ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు ఎప్పుడు తరలించాలన్న విషయంపై ఆయన కుటుంబ సభ్యులు, వైద్యులు నిర్ణయం తీసుకుంటారని లీలావతి ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దుండగుడు బలంగా కత్తితో పొడవడంతో వెన్నెముక పక్కన గాయమైందని వైద్యులు పేర్కొన్నారు. సైఫ్ వారం రోజుల పాటు జాగ్రత్తగా ఉండాలని, వెన్నెముకలో ఫ్లూయిడ్ లీకేజీని అరికట్టగలిగామని, సైఫ్ వెన్నెముకకు ఎలాంటి గాయం కాలేదని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. సైఫ్ ప్రస్తుతం నడవగలుగుతున్నారు. నడుస్తున్నప్పుడు తీవ్రమైన నొప్పి లేదా ఇతర ఇబ్బందులను ప్రస్తుతానికి గుర్తించలేదు. ఆయన్ని ఐసీయూ నుంచి ప్రత్యేక గదిలోకి మారుస్తాం. వెన్ను నుంచి కత్తిని తొలగించాం. గాయాల కారణంగా ఇన్ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. అందుకే ఆయనకు కొంతకాలం విశ్రాంతి సూచించాం. కొన్ని రోజుల తర్వాత పరిస్థితిని చూసి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు వివరించారు. 54 ఏళ్ల సైఫ్ అలీఖాన్ బాంద్రాలోని సద్గురు శరణ్ అపార్ట్ మెంటు 12వ అంతస్తులో ఉంటున్నారు. ఇంట్లో కరీనా కపూర్ తోపాటు నాలుగేళ్ల జేహ్, 8ఏళ్ల తైమూర్ , ఐదుగురు సహాయకులు ఉన్నారు. గురువారం తెల్లవారుజామున దొంగచాటుగా ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు... జేహ్ గదిలోకి వచ్చాడు. అక్కడే ఉన్న జేహ్ నానీ ఎలియామాను కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో హెక్సా బ్లేడ్ తో దాడి చేశాడు. శబ్దాలు విని వెంటనే జేహ్ గది వద్దకు వచ్చిన సైఫ్ పై దుండగుడు కత్తి, హెక్సా బ్లేడ్ తో దాడి చేశాడు. ఆయనకు ఆరు చోట్ల గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సైఫ్ ను ఇంట్లో పనిచేసేవారు ఆటోలో లీలావతి ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే నిందితుడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు విడుదల చేశారు.

మాఫియా గ్యాంగ్ పాత్ర లేదు: మంత్రి యోగేశ

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దుండగుడి దాడి ఘటనతో ముంబై మరోసారి ఉలిక్కిపడింది. గతంలో ప్రముఖులపై మాఫియా గ్యాంగ్‌లు దాడులకు పాల్పడిన ఘటనలను గుర్తుచేసింది. అయితే, సైఫ్ దాడి వెనుక చోరీ ఉద్దేశం మాత్రమే కనిపిస్తోందని మహారాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. దీనిలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయాన్ని తోసిపుచ్చారు. 'సైఫ్‌పై దాడి చేసినట్లుగా భావించి ఓ అనుమానితుడిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీలో కనిపించిన వ్యక్తి ముఖానికి దగ్గర పోలికలు ఉన్న ఈ యువకుడికి నేర చరిత్ర ఉంది. అయితే, ఈ ఘటనతో అతడికి సంబంధం లేదని గుర్తించాం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది' అని మంత్రి యోగేశ్ కదమ్ పూణెలో విలేకరులతో చెప్పారు. మరో వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారన్నారు. దాడిలో ఘటనలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... అటువంటి కోణం లేదని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు మంత్రి పేర్కొన్నారు. కేవలం చోరీ కోసమే నిందితుడు వచ్చినట్లు ఇప్పటివరకు తెలిసిందన్నారు. బెదిరింపు వచ్చినట్లు సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటివరకు సమాచారం లేదని, సెక్యూరిటీని కూడా కోరలేదని చెప్పారు. ఒకవేళ భద్రత కోరితే నిబంధనల ప్రకారం కల్పిస్తామన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

అల్వాల్ నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

వైద్య సేవలు పునఃప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లా అభివృద్ధి, సమన్వయం, మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశంలో జరిగిన చర్చల ప్రకారం అందించిన సూచనల మేరకు జిహెచ్ఎంసి హాల్, వెంకటాపూర్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించే పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం చర్యలు తీసుకుంది. అల్వాల్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో వైద్య సేవలను పునఃప్రారంభించి, రోగులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.టి. రఘునాథ్ స్వామి ప్రకటించారు. ఈ సౌకర్యంలో పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు, సామాన్య ప్రజలకు అవసరమైన వైద్య సేవలను సౌకర్యవంతమైన విధానంలో అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నదని, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలని ప్రజలను అభ్యర్థించారు.

సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 126 డివిజన్ జగద్గిరిగుట్ట అధ్యక్షులు గణేష్, యువజన సీనియర్ నాయకులు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్‌లోని వారి నివాసంలో కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడా విలేజ్ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్డును వేయాలని, మంచి నీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, వీధి దీపాలను వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆరెకపూడి గాంధీ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే కొత్తగూడా విలేజ్‌లో పర్యటిస్తానని, కొత్తగూడాలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, త్వరలోనే సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, అసంపూర్తిగా మిగిలి పోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్లను దశల వారిగా పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ వాసులు ఉట్ల దశరథ్, ప్రసాద్, కృష్ణ, శ్రీనివాస్, నరేష్, శ్రీహరి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థి వేముల రోహిత్‌కు నివాళులర్పించిన వడ్లమూరి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: దళిత బహుజన విద్యార్థి ఉద్యమం ధ్రువతార రోహిత్ వేముల చక్రవర్తి 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులను దళిత బహుజన పార్టీ డిబిపి జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో డా. అంబేద్కర్ రాజ్యాంగంను అమలు జరగాలని యూనివర్సిటీల్లో ప్రజాస్వామ్యం, లౌకిక, సమతా వాతావరణం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ దళిత బహుజన జాతుల విద్యార్థి లోకం ఎదురుకుంటున్న సమస్యలు పరిస్కారించాలని రోహిత్ వేముల ఉద్యమించాడని అన్నారు. హెచ్‌సీయూ అధికార యంత్రాంగంపైన కేంద్ర సర్కార్, కాషాయం, బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, విహెచ్‌పి వంటి మనువాద రాజకీయ సంస్థలతో పోరాడి ఆ క్రమంలో వారి కుట్రలతోనే మరణించిన పోరాట మేధావిని కోల్పోవటం చాలా బాధాకరం అన్నారు. తన జీవిత త్యాగం మరణం ద్వారా నైనా కుల వివక్షత, అణిచివేతలకు వ్యతిరేకంగా ఎస్సి, ఎస్టీ, బీసీ సమాజం ఐక్యత పోరాటం నిర్వహిస్తారని రోహిత్ వేముల చక్రవర్తి ఆశించాడన్నారు. రోహిత్ వేముల ఆశయాలు సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇటికాల గణేష్, ఎమ్.రవీందర్ ముదిరాజ్, చిప్పరి సుబ్బారావు, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్‌రావు, బేగరి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.సుచంద్ర పాల్గొన్నారు.

26 నుండి కొత్త రేషన్ కార్డులు జారీ

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం చేయడం జరిగిందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే జనవరి 26 నుండి కార్డుల జారీ చేయడం జరుగుతుందన్నారు. కరీంనగర్‌లోని ఇందుర్తిలో విలేకరులతో మాట్లాడుతూ రేషన్ కార్డుల విషయంలో ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేసి రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. రేషన్ కార్డు అర్హత ఉండి రాకుంటే సంబంధిత అధికారికి, ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వచ్చని స్పష్టం చేశారు. జనవరి 26 నుండి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ కోసం గ్రామాల్లో సర్వే జరుగుతుందని స్పష్టం చేశారు. 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే తెలంగాణలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని కానీ ఇప్పుడు పాత రేషన్ కార్డులు చర్చ లేదన్నారు. గత 10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి ఇది శుభవార్త అన్నారు. అదేసమయంలో పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని, ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదు, ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే దానిని నమ్మవద్దన్నారు. కుల సర్వే ఆధారంగా అప్లికేషన్‌ల సమాచారం ఆధారంగా కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు వస్తున్నాయని, ఇప్పటికే 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశాం, రైతు భరోసా 12 వేలు ఇస్తున్నాం, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే భూమి లేని రైతు కూలీలకు 12 వేలు ఇస్తున్నామని వివరించారు. ఇంధుర్తి మండల ప్రతిపాదనలు పంపామని అందులో భాగంగా రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలం ఏర్పడుతుందన్నారు.

రేషన్‌కార్డ్‌ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రేషన్ కార్డ్‌ల జారీ కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెహదీపట్నం మండలం విజయనగర్ హుమాయున్‌నగర్ కాలనీలో రేషన్ కార్డుల జారీ కోసం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే కోసం నియమించిన బృందంలోని సిబ్బంది అందరూ వచ్చారా లేదా అని పరిశీలించారు. సర్వే కోసం నియమించిన బృందం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా బాధ్యతతో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన వారు ఎవరు కూడ తప్పిపోవద్దని, రిమార్కులు సరిగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రమేష్, రెవిన్యూ, జీహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందేలా పని చేయాలి

జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి నిరుపేదకు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పని చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక అన్నారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని శామీర్ పేట తహసిల్దారు కార్యాలయంలో సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టరు గౌతంతో కలిసి స్పెషల్ ఆఫీసర్ శంశాంక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబరు ప్రకారం వ్యవసాయ యోగ్యమైనదా, కాదా అనే స్పష్టతను గుర్తించి నివేదికల ను తయారు చేయాలని సూచించారు. ఫైనల్‌గా తహసీల్దారు సమగ్ర నివేదికను పరిశీలించాలని తెలి పారు. గుట్టలు,రాళ్లు, లే అవుట్లు, కాలేజీలు, గోడౌన్లు, పౌల్ట్రీ, ఇటిక బట్టీలు వంటి వాటిన వ్యవసాయేతరంగా చూపించాలన్నారు. గ్రామస్థాయిలో గ్రామ సభలు, మున్సిపాలిటీల స్థాయిలో వార్డు సభలను పక్కాగా నిర్వహించే విధంగా కార్యచరణ పొందించుకోవాలన్నారు. గ్రామ సభల పట్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి (ధరణి) పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ భూములు, లేఅవుట్ చేసిన భూములు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, రాళ్ళు, రప్పలు, గుట్టలతో నిండి, సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి, తొలగించాలని సూచించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులన్నీ క్రోడీకరించుకోవడంతో పాటు గ్రామాల మ్యాపులను పరిశీలించాలన్నారు. జిల్లాల వారీగా కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని పేద కుటుంబాల జాబితా ప్రకారం పరిశీలించాలని, ఇందుకోసం జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఎస్ఓ పర్యవేక్షకులుగా వ్యవహరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపాలిటీలో మునిసిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారని, అలాగే భూములు, ఆదాయం తదితర అంశాలను రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు గుర్తించాలని, పంచాయతీ కార్యదర్శులు కుటుంబాల వివరాలను సేకరించాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరి, డిఆర్ డిఓ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరా అధాకారి సుగుణబాయి, హౌజింగ్ పిడి రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్ కమీషనర్ వెంకట గోపాల్, ఎంపిడిఓ మమత బాయి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టిగా కృషి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కోల్ మైన్స్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్వో) 183వ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పింఛన్దారుల సంక్షేమం దృష్ట్యా పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. తొలిసారిగా హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సీఎంపీఎఫ్ అధికారులు, బొగ్గు కంపెనీల ప్రతినిధులు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం కోసం సీఎంపీఎఫ్ ద్వారా సేవల అందిస్తున్న విషయాన్ని బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ గుర్తు చేశారు. ఈ పింఛన్ సేవలను మరింత మెరుగు పరచడంతోపాటు, కార్మికులకు పింఛన్ భద్రతను కల్పించడంపై విస్తృతంగా చర్చించారు. పింఛన్ నిధిని ఆర్థికంగా పరిపుష్టి పరచడం, పింఛన్ నిధిని అత్యంత పారదర్శకంగా సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిరూపిందర్ బ్రార్, సంయుక్త కార్యదర్శి, ఫైనాన్సియల్ సలహాదారు మిస్ నిరుపమా కొట్రూ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సీఎంపీఎఫ్ కమిషనర్ విజయ్ కుమార్ మిశ్రా, యూనియన్ల నుంచి బోర్డు ఆఫ్ ట్రస్టీలు రామేంద్ర కుమార్, కె.లక్ష్మారెడ్డి, డి.డి.రామానందన్, రాకేశ్ కుమార్, ఆశీశ్ క్రిష్ణ మూర్తి, డి.ఎన్.సింగ్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఎస్ఈసీఎల్ సీఎండీ డాక్టర్ ప్రేమ్ సాగర్ మిశ్రా, కోలిండియా డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ వినయ్ రంజన్, డైరెక్టర్ (ఫైనాన్స్) ముకేశ్ అగర్వాల్ హాజరయ్యారు. సింగరేణి డైరెక్టర్లు డి.సత్య నారాయణ రావు, జి.వెంకటేశ్వరరెడ్డి, జీఎం (కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం (వెల్ఫేర్) శ్రీనివాసరావు, సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి పాల్గొన్నారు.

నివాసాలకు ఇబ్బంది లేకుండా స్థల సేకరణ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని గౌతంనగర్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యుబి నిర్మాణంలో స్థానిక ప్రజల నివాసాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థల సేకరణ జరుపుతామని ఎంఎల్ఏ మర్రి రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. గజానికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించి భూమి సేకరిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం గౌతంనగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఆర్‌యుబి నిర్మాణానికి సేకరించాల్సిన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ్ నగర్ ఆర్‌యుబి నిర్మాణంలో నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వకుండా చూస్తామన్నారు. శుక్రవారం ఆయన గౌతమ్ నగర్ ఆర్‌యుబి నిర్మిత ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ స్థానికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా శాసనసభ్యునికి వివరించారు. అయితే ఈఆర్‌యుబి నిర్మాణం వల్ల తమ ఇళ్లు కోల్పోవాల్సి వస్తుందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా ఆర్‌యుబి నిర్మాణానికి స్థల సేకరణ జరుపుతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ నిర్మాణం కోసం రైల్వే, ఎలక్ట్రిసిటీ, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులతో ఎన్నో సమావేశాలు నిర్వహించి ఇప్పటికి ఒక కొలిక్కి తీసుకు రాగలిగామని ఆయన వివరించారు. ఎమ్మెల్యేతో పాటు అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, రైల్వే ఇంజనీరింగ్, ఎలక్ట్రిసిటీ, జలమండలి, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

నేడు బ్లడ్ డొనేషన్ డ్రైవ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని 18న శనివారం ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్, హైదరాబాద్ నందు లెజండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్-మెగా రక్తదాన శిబిరం నిర్వహించబడుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఎన్.టి.ఆర్ అభిమానులు పాల్గొని ఆ మహానుభావునికి ఆత్మీయ నివాళి అర్పించి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా ఆమె కోరారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల అట్రాసిటీ, ల్యాండ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పోలీస్, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, భూ సమస్యలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులతో పాటు చైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొని అట్రాసిటీస్, ల్యాండ్ సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులపై నిర్లక్ష్యం చేస్తే కమిషన్ చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి డిఎంసి, ప్రతి నెల సివిల్ రైట్స్ సమావేశాలు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలోని అట్రాసిటీ కేసుల నష్ట పరిహారం రూ. 2 కోట్ల 48 లక్షలు ఉన్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇప్పుడివరకు 1216 అట్రాసిటీస్ కేసులు పెండింగ్ ఉన్నాయని పరిష్కార కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. అలాగే ల్యాండ్ సమస్యలకు సంబందించిన 4 కేసులు పెండింగ్ ల ఉన్నాయని పరిశీలన చేసి నెలలోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ నాపై దాడులను అరికట్టాడంలో సహకరించాలని, క్రైమ్ రేట్ తగ్గేలా, పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలు, సభ్యులు పలు సమస్యలపై కమిషన్‌కి వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ముకుంద రెడ్డి, డిసిపి శ్వేత, కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కురసం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి రాంప్రసాద్, బి.ఎల్లేష్, డి.సుదర్శన్ బాబు, ఇటిక గోపి, బి.వెంకటేశ్వర్‌రావు, ఎన్జీవో పులి కల్పన, డిఆర్‌ఓ వెంకటాచారి, డీడీ సోషల్ వెల్ఫేర్ ఆర్ కోటజీ, ఆర్‌డిఓలు సాయిరామ్, రామకృష్ణ, ఏసీపిలు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పెండింగులో ఉన్న మంజీర పైప్ లైన్ పనులను మంజూరు చేయాలని, హాఫీజ్ పెట్ ఫ్లైఓవర్ నుంచి హుడా కాలనీ వరకు మంజీర రోడ్డులో చేప్పట్టిన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు దిశనిర్దేశంలో అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టడం జరుగుతుందని, మంజీర పైప్ లైన్ పనులతో ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చెప్పటడం జరుగుతుందన్నారు. హాఫీజ్ పెట్ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ మంజీర రోడ్డు నందు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ డీఈ, ఏఈ ఇతర డివిజన్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తూ, మౌళిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, మెరుగైన జీవన విధానాన్ని కల్పించడం కోసం శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వీరేందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ కృష్ణ ముదిరాజ్, నారాయణరావు, కృష్ణ మూర్తి, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి

'వన్ స్టేషన్ వన్ ప్రోడక్ట్' స్టాల్ కేటాయింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్, ట్రాలీ స్టాండ్ కేటాయించ బడింది. ఈ స్టాల్‌ను ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు నిర్వహిస్తారు. ఈ స్టాల్‌లో స్నాక్స్, జూట్ బ్యాగ్‌లు, సబ్బులు, అనేక రకాల చేతితో తయారు చేసిన ఉత్పత్తులను విక్రయా నికి అందుబాటులో ఉంచడం జరిగింది. జాస్మిన్ (ట్రాన్స్‌జెండర్ ఎంటర్‌ప్రెన్యూర్) 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ, "ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ చాలా కాలంగా, ఉద్యోగ అవకాశాల కొరతను ఎదుర్కొంటోందన్నారు. కొత్తగా ప్రారంభించబడిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌లో మాకు ఒక స్టాల్, ట్రాలీ స్టాండ్ ఇవ్వబడిందన్నారు. తద్వారా మా చేతి వృత్తుల నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశం కలిగినట్లయిందన్నారు. ఈ స్టాల్, ట్రాలీ మా కమ్యూనిటి పురోగతికి సమానత్వ గుర్తింపుకు చిహ్నాలన్నారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ వినూత్న చొరవ సమాజంలోని అణగారిన వర్గాలకు మార్కెట్‌ను అందించడం, స్థానిక, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుం దన్నారు. 2022-23 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ భావనకు స్థానిక ప్రజల నుండి అపారమైన స్పందన లభించిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని 77 స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్‌లోని 104 స్టేషన్లతో కలుపుకొని మొత్తంగా 223 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి' స్టాళ్లు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని దక్షిణ మధ్య రైల్వేజోన్‌లో 205 రైల్వే స్టేషన్లలో నిర్వహించబడు తున్నాయన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ సమాజంలోని అన్ని వర్గాల వారి సృజనాత్మ కత ప్రతిభను ప్రదర్శించడానికి ఒక సరైన వేదిక, అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ఓఎస్ఓపీ స్టాల్‌ను నిర్వహించే అవకాశం ట్రాన్స్‌జెండర్లకు లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి: సీఐ

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఏఎస్ఐలు విధులను నిబద్ధతతో నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమనగల్ సీఐ ప్రమోద్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆమనగల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లలో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న యాదయ్య, సీతారాంరెడ్డిలు ఎస్ఐలుగా పదోన్నతి పొందడంతో వారికి ఆయన బ్యాడ్జను అందజేసి అభినందించారు. ఎస్ఐలు వెంకటేష్, శ్రీకాంత్, ఏఎస్ఐ మురళీధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి, రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారం చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి. గౌతమ్, జిహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి, సిఎంఆర్వో డైరెక్టర్ మకరంద్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి జాబితా, నివాస స్థలం లేని వారి జాబితా రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు వంటి అంశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రిగారు సిఎస్ కి సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం విఆర్వో, విఆర్ఎ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

కేటీఆర్ మెంటల్ ఆసుపత్రికి వెళ్లడం ఖాయం : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత పదేళ్ల పాటు అధికారంలో ఉండి రాష్ట్రంలో పనికిరాని రాజకీయం, పనికిరాని పాలన చేశారని ఎంపీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా కేటీఆర్‌కు నోటి దూల ఎక్కువైందని దీన్నిబట్టి చూస్తుంటే ఆయన త్వరలోనే మెంటల్ ఆసుపత్రికి వెళ్లడం ఖాయమని ఓ ప్రకటనలో తెలిపారు. అతి త్వరలో కేటీఆర్ చేసిన మరిన్ని స్కాములు బయటకు రాబోతున్నాయన్నారు. 2014, 2018 మేనిఫెస్టోలో చెప్పిన అంశాలు మీరు చేసింది గుండు సున్నా అని మండిపడ్డారు. అప్పట్లో 20శాతం హామీలు కూడా అమలు చేయలేదని, అధికారం కోల్పోయిన తర్వాత నిద్ర పట్టక ఏది పడితే అది మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మీరు 10 సంవత్సరాలలో రైతుల కోసం రూ.84 కోట్లు ఖర్చు చేస్తే మేము ఒక్క సంవత్సరంలోనే సుమారుగా రూ.50 వేలకు కోట్లకు పైగా రైతుల కోసం ఖర్చు చేశామని చెప్పారు. 24 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రైతుల కోసం రుణమాఫీ చేశామని, మీరు రైతుబంధు కింద రైతులకు మిత్తి మాత్రమే చెల్లించారని విమర్శించారు. సాగు చేసే భూములకు మాత్రమే మేము రైతు భరోసా ఇస్తామని మీలాగా రోడ్లకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, గుట్టలకు ఇవ్వమని స్పష్టం చేశారు. మీరు చేసిన విధంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయమన్నారు. ఓ పక్క నువ్వు హెచ్ఎండిఏ నిధులు నీ దోస్తుల కోసం ఖర్చు చేశారని, తెలంగాణ ఇచ్చింది యూపీఏ ప్రభుత్వం అనే సోయి కూడా కేటీఆర్ కు లేదన్నారు. మాకు ఇంకా నాలుగు సంవత్సరాల సమయం ఉంది నాలుగు సంవత్సరాలలో అన్ని స్కీములు అమలు చేసి చూపిస్తామన్నారు. మేము అలా చేయకుంటే ప్రజలే మాకు బుద్ధి చెప్తారు తప్ప నువ్వు కాదని, ఒక మంచి ప్రతిపక్ష నాయకులుగా వాస్తవాలు మాట్లాడాలని సూచించారు.

రేషన్ కార్డు దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రారంభం

విశాలాంధ్ర - కాప్రా : నాచారంలో జరుగుతున్న రేషన్‌కార్డు దరఖాస్తుదారుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సరస్వతి నగర్ కాలనీలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాచారం డివిజన్లో దరఖాస్తు చేసుకున్న సుమారు 689 మంది దరఖాస్తుదారుల ఇంటి వద్దకే వచ్చి అధికారులు వెరిఫికేషన్ చేస్తారని తెలియజేశారు. ఇందుకోసం ముగ్గురు అధికారులను ఏర్పాటు చేసినట్లుగా తెలియజేశారు. ఎవరు కూడా వెరిఫికేషన్‌కు అధికారులకు గాని వేరే ఇతర వ్యక్తులకు గాని డబ్బులు అడిగినా లేదా ఎవరైనా డిమాండ్ చేసిన కార్పొరేటర్ కు ఫిర్యాదు చేయాలని ఎవ్వరు కూడా డబ్బులు ఇవ్వవద్దని తెలియజేశారు. న్యాక్ ఇంజనీర్ సంతోష్, బారాస రాష్ట్ర నాయకులు సాయి జన్ శేకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హక్కులు, చట్టాలపై పటిష్ట చర్యలు చేపట్టండి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలో బాల్యం నుంచి పక్కదారి పట్టిన పిల్లలను ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించి పిల్లల పరిరక్షణే ధ్యేయంగా హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జేన్స్ ఆన్ ఆపరేషన్ స్మైల్ -11 సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల హక్కులు చట్టాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ పటిష్ట చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖతో పాటు అనుబంధ శాఖలైన పోలీస్ రెవెన్యూ, లేబర్ శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో బిక్షాటన చేస్తున్నా పిల్లలు, బాల కార్మికులకులు, వీధి బాలలకు విద్యతో పాటు సంరక్షణ చర్యలు తీసుకోవాలని అలాగే పిల్లలు ఈ విదంగా మారడానికి గల కారణాలు పరిశీలన చేయాలని సూచించారు. హాట్ స్పాట్ ఏరియాలలో గస్తీ చేసి రోడ్డుపై వచ్చే పిల్లలను గుర్తించాలని అలాగే పిల్లల ఆధార్, ఇతర డాక్యుమెంట్స్ సేకరించాలన్నారు. హైదరాబాద్ జిల్లా మిగతా జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టాలని అలాగే 14 నుండి 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను రక్షించి సంబంధిత వారిపై కేసులు నమోదు చేసి పిల్లలకు నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. ఈ విధంగా జిల్లాలో 28 జోన్లుగా విభజించి ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా పిల్లల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, జెజె యాక్ట్ ప్రకారం స్వచ్ఛంద సంస్థలు 42 అలాగే ప్రభుత్వ హోమ్స్ 6లలో 2224 మంది పిల్లలు సంరక్షణలో ఉన్నారని అలాగే అందులో 72 మంది పిల్లలను దత్తత ఇవ్వడం జరిగిందని అన్నారు. అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలని నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే స్ట్రీట్ వెండర్లు పిల్లలతో వ్యాపారం చేయించడం నేరమని పిల్లల తల్లిదండ్రులతో పిల్లల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో సిడబ్ల్యూసి చైర్ పర్సన్ శైలజ, డిసిపి లావణ్య, పిడిఐసిడి ఏస్ అక్కేశ్వరరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి జాసన్, ఆర్డీవో రామకృష్ణ, తహసిల్దార్లు, పోలీస్ అధికారులు అనుబంధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలోని 4, 15,16,17,18,19 వార్డులలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఉదయం శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు, డ్రైనేజీ, సిసి రోడ్లు పలు అభివృద్ధి కార్యక్రమాలు మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని అన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీ పలు అభివృద్ధి నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డిఈ సాయినాథ్ గౌడ్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు, డివిజన్ల సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

విశాలాంధ్ర-దుండిగల్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో 120 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొందరు అక్రమార్కులు నిర్మాణాలను చేపట్టారు. దీంతో శుక్రవారం సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఆ అక్రమ నిర్మాణాలను జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, అట్టి నిర్మాణాలను కూల్చివేస్తామని వారు హెచ్చరించారు. అదే విధంగా ఎవరైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

చాకలి, రజక, మడేల్ కుల నామాలను మాత్రమే ప్రభుత్వ గెజిట్‌లో చేర్చాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణలో చాకలి, రజక, మడేల్ కుల నామాలను మాత్రమే ప్రభుత్వ గెజిట్‌లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర రజక మహిళ సంఘం ఫౌండర్ చైర్మన్ అధ్యక్షురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వన్నార్ పదంకు పర్యాయ పదంగా మండేల్ కుల నామాన్ని మాత్రమే చేర్చాలని, ధోబి పదంను ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో కుల నామంగా చేర్చి కూడదని తెలంగాణ బీసీ కమిషన్ ముందు వాదనలు వినిపించామని ఆమె వెల్లడించారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సౌకర్యాలు పెంచండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్‌నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలని రోగులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి కావలసిన ఏర్పాట్లను చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆస్పత్రిలో సిబ్బంది సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రికి అదనంగా 22.80 లక్షల రూపాయలు కేటాయిస్తే ఉపయోగంలోకి వస్తుందని తెలిపారు. అలాగే షాద్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ ఆసుపత్రికి అదనంగా 5.31 కోట్ల రూపాయలు కేటాయిస్తే మార్చురి, మోడ్రన్ కిచెన్, మెకానికల్ లాండ్రి, కాంపౌండ్ వాల్, సీసీ రోడ్డు, పార్కింగ్ షెడ్, బయో మెడికల్ వెస్టేజి భవనం లాంటి నిర్మాణాలు పూర్తి అవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే అదనపు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్ కుమార్, టీజీ యంఐడిసి ఎండి హేమంత్, ఉమ్మడి జిల్లా వైద్య శాఖ అధికారులు, డిజిహెచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

హైటెక్ సిటీలో 'స్పిన్' ఎక్స్‌పీరియన్స్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : లైఫ్‌స్టైల్ బ్రాండ్ 'స్పిన్' హైదరాబాద్ హైటెక్ సిటీలో తన తొలి ఎక్స్పీరియన్స్ స్టోర్‌ను ప్రారంభిం చింది. ఈ సందర్భంగా స్పిన్ ఫౌండర్ అవినీష్ జైన్ మాట్లాడుతూ ఈ స్టోర్ డబుల్ హైట్‌లో అంతర్గత డిజైన్, ఆర్కిటెక్చరల్ లైన్స్, వార్మ్ న్యూట్రల్ కలర్స్‌తో ఆకట్టుకుంటుం దని తెలిపారు. ఈ స్టోర్ ప్రతి ఒక్కరికి సరికొత్త అనుభూతిని అందిస్తుం దనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఇది కేవలం షాపింగ్ కోసం మాత్రమే కాదన్నారు. ఈ స్టోర్ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే విధంగా ఉంటుందన్నారు. ఈ స్టోర్‌లో 3,500 పైగా డిజైన్ చేసిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా స్కై హోమ్ బార్, సెంటర్ టేబుల్, నేటివ్ షెల్ఫ్ వంటి ఉత్పత్తులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయని తెలిపారు. బిస్ట్రో అవుట్‌డోర్ కలెక్షన్.. ఎకో-ఫ్రెండ్లీ అల్యూమినియంతో తయారైన బోల్డ్ ఎంతో మన్నికైనవన్నారు. ఎకో కాలెక్టిబుల్స్, పునర్వినియోగం చేసిన ఉడ్, లోహంతో తయారు చేసిన ఉత్పత్తులు కలవన్నారు. సినర్జీ కలెక్షన్, సన్నని మెటల్, ఎకో ఫ్రెండ్లీ కలయికతో తయారైన డిజైన్స్ ఉన్నాయని తెలిపారు. ఇవి ప్లానెట్ కాన్షియస్ లివింగ్ పట్ల స్పిన్ అంకితభావాన్ని మరింత బలపరుస్తున్నాయని చెప్పారు. ఉత్పత్తులను అందరికి అందుబాటులో ఉంచడంలో భాగంగా కొత్త ధరలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ ధరల సరళీకరణ ప్రతి ఒక్కరికీ మంచి డిజైన్ అందుబాటులో ఉంచాలన్న మా నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఉత్పత్తుల నాణ్యత, శిల్పకళపై ఎలాంటి రాజీ పడకుండా ధరలను తగ్గించామని చెప్పారు.

డీహైడ్రేషన్‌కు 'డబ్ల్యుహెచ్ఓ ఓఆర్ఎస్'తో ఉపశమనం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : డయేరియా కారణంగా కలిగే డీహైడ్రేషన్కు 'డబ్ల్యుహెచ్ఓ ఓఆర్ఎస్'తో ఉపశమనం లభిస్తుందని కెన్వ్యూ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ ఆనంద్ తెలిపారు. డయేరియా రోగుల్లో డీహైడ్రేషన్ తరిమి కొట్టడమే లక్ష్యంగా 'డబ్ల్యుహెచ్ఓ ఓఆర్ఎస్' విడుదల చేశామన్నారు. ఇది శాస్త్రీయ ఆధారాలతో, నిపుణుల సిఫార్సులతో తయారు చేశామన్నారు. ఈ కొత్త ఉత్పత్తి యాపిల్, ఆరెంజ్ రుచులలో లభ్యమవుతుందని పేర్కొన్నారు. ఇది భారతదేశంలో నెంబర్ వన్ రెడీ-టు-డ్రింక్ ఎలక్ట్రోలైట్ డ్రింక్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిందన్నారు. శాస్త్రీయంగా తయారైన ఫార్ములాతో ఇరవై సంవత్సరాలుగా రెడీ-టు-డ్రింక్ ఎలక్ట్రోలైట్ కేటగిరీని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఇదివరకు నాన్ డయేరియల్ రికవరీకి ఉపయోగపడే ఫ్లూయిడ్స్, ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ శ్రేణి హైడ్రేషన్ ఫార్ములేషన్ అందించామని తెలిపారు. ఈ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ డయేరియా వల్ల కలిగే డీహైడ్రేషన్ కోసం ఓఆర్ఎస్ ను విడుదల చేశామన్నారు. భారతదేశంలో డయేరియా అనేది ఐదేళ్ల లోపు పిల్లల్లో మరణానికి మూడో ప్రధాన కారణంగా ఉందన్నారు. డయేరియాకు చికిత్సలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన ఔరల్ రిహైడ్రేషన్ సాల్ట్స్ (ఓఆర్ఎస్) ప్రామాణికంగా ఉన్నప్పటికీ దీని వినియోగం తక్కువగా ఉందని తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 (2019-21) ప్రకారం ఐదేళ్లలోపు పిల్లల్లో ఓఆర్ఎస్ కవరేజ్ 60.6 శాతం మాత్రమే ఉందన్నారు. డయేరియా నివారణకు ఒరల్ రీహైడ్రేషన్ సాల్ట్ సొల్యూషన్ మెరుగైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆర్వీఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కన్సల్టెంట్ పీడియాట్రిషన్ డాక్టర్ సీ సురేష్ కుమార్ మాట్లాడుతూ డబ్ల్యుహెచ్ఓ ఓఆర్ఎస్ డయేరియా డీహైడ్రేషన్ చికిత్సలో గోల్డ్ స్టాండర్డ్ అన్నారు.

బీసీ రథయాత్రను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: కస్తూరి గోపాలకృష్ణ జై బిసి జాతీయ అధ్యక్షులు చైర్మన్ ఆధ్వర్యంలో కొండాపూర్ బీసీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో బీసీ తెలంగాణ రాష్ట్ర సంఘాల, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర బీసీ సేవాదళ్ అధ్యక్షులు ఒంగూరు శ్రీనివాస్ యాదవ్, శేరిలింగంపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అడ్వకేట్ రమేష్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్, బీసీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి బి.కృష్ణ, శేరి లింగంపల్లి బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్ టీఎన్జీవోస్ కాలనీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు మధుకర్ చారి,, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి జంగం గౌడ్ కొండాపూర్ డివిజన్ అధ్యక్షులు నీలం లక్ష్మీనారాయణ ముదిరాజ్, పెద్దలు శ్రీనివాస్ ప్రభాకర్ యాదవ్ అభిమానులు ముఖ్యులు సమావేశంలో పాల్గొన్నారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో బీసీ చైతన్య రథయాత్ర చేపట్టడం జరుగుతుందని మొదటగా శేరిలింగంపల్లి నియోజకవర్గం 10 డివిజన్లో తిరిగి ఆ తర్వాత బాధ్యతగా పది జిల్లాలలో చుట్టివచ్చి హైదరాబాద్ జిల్లా సహా మిగతా అన్ని జిల్లాలను 33 బీసీల రథయాత్రను చేపట్టి బీసీలను చైతన్యపరిచి ఏకం చేసి రాజ్యాధికార దిశగా తీసుకెళ్దామని చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయంలో మేధావులు పెద్దలు బీసీ నాయకులు అందరూ సహకరించి బీసీ రథయాత్రను విజయవంతం చేయాలని బీసీలకు పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ తన సందేశంలో మనం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రథయాత్రను శేర్లింగంపల్లి 10 డివిజన్ నుంచి ప్రారంభించి హైదరాబాద్ 150 డివిజన్లో విస్తరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేయతలపెట్టిన రథయాత్రను శాయశక్తుల సమన్వయంతో, సహకారంతో తప్పకుండా విజయవంతం చేస్తామని నాకు నమ్మకం ఉంది. అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. జనవరి 26న జెండా ఎగరేసే కార్యక్రమానికి సహకరించాలని ఫిబ్రవరిలో జరిగే రథయాత్ర కార్యక్రమంలో బీసీలందరూ సహకరించాలని కోరడం జరిగింది. బీసీ పెద్దలు చాలామంది ప్రసంగించడం విశేషం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్, ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి బి.కృష్ణ మాట్లాడుతూ అన్ని కార్యాక్రమాల్లో మీకు సహకరిస్తామని మీ వెంటే ఉంటామని రథయాత్రలో గాని జెండా కార్యక్రమంలోని అన్ని స్నేహపూర్వకంగా ఉంటామని హామీ ఇవ్వడం జరిగింది.

ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాల్లో భాగంగా ఈనెల 16 నుండి 20 వరకు అధికారుల బృందం పర్యటించి అర్హులను గుర్తించే ప్రక్రియ మొదలైందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ కోరారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హుల ఎంపిక జరిగే విధంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోడం జరుగుతుందని, ప్రతి అర్హుడైన పేదవాడికి పథకం అందే విధంగా అధికారులు కృషి చేయాలని ఆశించారు. పేదవాడి కళలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని, వారి అభ్యున్నతికి పాటుపడే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఉండే సొంతింటి కళను నెరవెర్చే ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తొలి దశలో సొంత స్థలాలున్న వారికి ప్రాధాన్యమిస్తూ ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా వారి ఇంటి వద్ద ఫోటో తీసి ఆప్ లో పొందుపరుస్తూ ఎవరి ఇల్లు వారే నిర్మించుకునే విధంగా ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి, దరఖాస్తు చేసుకొని వారికోసం దరఖాస్తు చేస్కోడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు దరఖాస్తు చేసుకున్న వారు చనిపోతే, వారి కుటుంబ సభ్యులు తిరిగి దరఖాస్తు చేసుకోడానికి అనువుగా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియ ప్రభుత్వం ఇప్పటికె ప్రకటించడం అందరికి విదితమే అని, తెలంగాణలో 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసిందని, కుల సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డుల పంపిణీ ఉంటుందని స్పష్టం చేశారు.

రేషన్ కార్డుల సర్వే పక్కగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన రేషన్ కార్డుల జారీలో భాగంగా నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ సర్వే బృందాలను ఆదేశించారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొండమల్లేపల్లి గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలలో నూతన రేషన్‌కార్డుల జారీకై నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని అర్హులను రేషన్ కార్డులకు ఎంపిక చేయాలని, జాబితాను గ్రామసభలో ఆమోదం తీసుకుని పంపించాలని ఆదేశించారు. 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో అర్హుల జాబితాను చదివి వినిపించి ఆమోదం తీసుకొని పంపించాలని చెప్పారు. దేవరకొండ ఆర్డిఓ వై.రమణారెడ్డి, తహసిల్దార్ ఉన్నారు.

99 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శుల సర్వీసను నిలిపివేత

నల్లగొండ జిల్లాలో 99 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ బ్రేక్ నిలివేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 99 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా నెలల తరబడి విధులకు గైర్ హాజరు కావడం జరిగింది. వీరిలో కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. ముందస్తు అనుమతి లేకుండా దీర్ఘకాలం విధులకు గైర్హాజరైనందుకు వారిపై క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెన్షన్‌కు గురయ్యేవారు. కానీ మానవతా దృక్పథంతో వారిని సస్పెండ్ చేయకుండా సర్వీస్ బ్రేక్‌తో విధులలోకి తీసుకోవడం జరిగిందన్నారు.

20న ఛలో ఉట్నూర్ మహాధర్నా

విశాలాంధ్ర - కొమరం భీం : బెజ్జూరు ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టే చలో ఉట్నూర్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల మండల సర్ మేడి కొడప శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ మూడు గిరిజన సంక్షేమ శాఖలో 29 విభాగాలలో 100శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ సంబంధిత జీవోలను ఒకే చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1/70 పెస అటవీ హక్కులు, ఏజెన్సీ ప్రాంత చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ పోడు భూములకు పట్టాలిచ్చి ఆదివాసీలకు శాశ్వత హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. 50 శాతం ఆదివాసీలు ఉన్న గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా గుర్తించాలన్నారు. మండలంలోని ఆదివాసి గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసి సంఘాల నాయకులు సకారాం, కోరేత తిరుపతి, బానయ్య, ధర్మయ్య, తులసిరాం, మాజీ సర్పంచ్ తిరుపతి ఉన్నారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ఎజెండా : ఎమ్మెల్యే జారె

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి పథకాలు నిబద్ధతగా అమలు చేస్తుందని అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అందించే నాలుగు పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరితో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుందన్నారు. నియోజకవర్గ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రూ.60 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభించారు. అదేవిధంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ బోయే బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 లక్షలతో నిర్మించే కల్వర్టుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కొత్తకావడిగుండ్ల గ్రామంలో స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ టోర్నమెంటును ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువత చెడు వ్యసనాలు మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలని కోరారు. ఖాళీ సమయం ఉంటే క్రీడల్లో గడపాలని తద్వారా శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు ఉత్తమ ప్రతిభతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఆయన పలు గ్రామాలను సందర్శించి ఇందిరమ్మ ఇంటింటి సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యూబాకు ప్రగతిశీల శక్తులు అండగా నిలవాలి

- సీపీఐ పిలుపు
- అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్
- రానున్న ట్రంప్ పాలనపై ఆందోళన

న్యూఢిల్లీ: కమ్యూనిస్టు దేశమైన క్యూబాపై ఆంక్షల పేరుతో అమెరికా సాగిస్తున్న దమనకాండను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్రంగా ఖండించింది. అమెరికా పూర్తిస్థాయిలో క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. క్యూబా ప్రజలకు అచంచలమైన సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. క్యూబా సార్వభౌమాధికారానికి సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్యూబా చాలా కాలంగా సోషలిస్ట్ సూత్రాలకు ఒక దీపస్తంభంగా ఉంది. దశాబ్దాలుగా బాహ్య దురాక్రమణ, ఆర్థిక దిగ్బంధాలు, సామ్రాజ్యవాద జోక్యానికి వ్యతిరేకంగా ఎదురొడ్డుతూ స్థిరంగా ఉంది. క్యూబాపై ఆంక్షలను సడలించడానికి అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇటీవల తీసుకున్న నిర్ణయం సరైన దిశలో ఒక అడుగు మాత్రమే కానీ దశాబ్దాలుగా అమెరికా విధించిన ఆంక్షల వల్ల ఏర్పడిన లోతైన అన్యాయాలను పరిష్కరించడంలో విఫలమైందని సీపీఐ పేర్కొంది. క్యూబా బాహ్య పరిమితుల నుండి విముక్తి పొందేందుకు వీలుగా ఈ చర్యలను మరింత విస్తరించాలి. క్యూబా ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును అమెరికా గౌరవించాలి. వారి స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసే అన్ని రకాల జోక్యాలను నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఇక డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న క్రమంలో ఆందోళన వ్యక్తం చేసింది. గతంలో ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడు క్యూబాపై కఠిన

ఆంక్షలు విధించినట్లు గుర్తు చేసింది. అధ్యక్షుడు ఒబామా హయాంలో సాధించిన పురోగతిని నిర్వీర్యం చేస్తూ... ఆర్థిక దిగ్బంధాన్ని మరింత కఠినతరం చేసినట్లు పేర్కొంది. రానున్న ట్రంప్ పాలనలో ఈ క్రూర చర్యలు పునరుద్ధరించబడితే క్యూబా కష్టాలను తీవ్రతరం చేస్తుంది. ప్రపంచ వేదికపై క్యూబాను మరింత ఒంటరిని చేయడానికి అమెరికా ప్రయత్నిస్తుందని తెలిపింది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని కొనసాగించే ఎటువంటి చర్యలనైనా సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందని ప్రకటన పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రగతిశీల శక్తులు క్యూబాకు అండగా నిలబడాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. సార్వభౌమత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న దేశాలకు హాని కలిగించే దాని విధానాలకు అమెరికాను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా ఉంచాలని విజ్ఞప్తి చేసింది. సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించడం సహా సోషలిజానికి నమూనాగా ఉన్న క్యూబా అభివృద్ధి చెందుతూనే ఉండేలా చూసుకోవడంలో చేతులు కలపాలని అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు, శాంతి కాముకులకు సీపీఐ పిలుపునిచ్చింది.

రూ.23 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత

- సిలిండర్ వాల్వ్‌ల్లో ఉంచి విక్రయం
- ఆధునిక రవాణా ద్వారా కస్టమర్లకు చేరవేత
- రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్: నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు పెద్దఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారు. ఇద్దరు అంతర్‌రాష్ట్ర నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు వివరించారు. రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు శుక్రవారం వివరాలు వెల్లడించారు. నిందితులను రాజస్థాన్‌కు చెందిన మహేశ్, మహిపాల్‌గా గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్‌మెట్ పరిధిలో స్థిరపడ్డారని చెప్పారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో ఆధునిక మార్గాలు అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా అవతారమెత్తారన్నారు. గ్యాస్ రిపేర్ పరికరాల ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. సిలిండర్ వాల్వ్‌ల్లో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని చెప్పారు. అనుమానం రాకుండా వోలా, ఉబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ రూ.లక్షకు కొనుగోలు చేసి దాదాపు రూ.23 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ వ్యాపారి నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని వివరించారు. డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు. పిల్లలు, యువత మత్తుకు బానిస కాకూడదంటే ప్రజల సహకారం అవసరమన్నారు. కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఎకరానికి రూ.17,500 బాకీ

- రైతుబంధు రూ.15 వేలు ఇవ్వాలి
- ఆడబిడ్డలను మోసగించిన రేవంత్ సర్కార్
- అమలుకాని హామీలపై ధ్వజం
- త్వరలో 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: కాంగ్రెస్ అభయహస్తం తెలంగాణ ప్రజల పాలిట భస్మాసుర హస్తంలా మారిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా సక్రమంగా అమలుచేయకుండానే, అన్నీ చేశామని దిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి గప్పాలు కొడుతున్నారని విమర్శించారు. కన్నతల్లికి అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బిర్యాని పెడ్తా అన్నట్టుగా, తెలంగాణలో ఒక్క హామీ కూడా అమలుచేయకుండానే దిల్లీలో అమలుచేయించే గ్యారంటీ తనదే అని రేవంత్ చెప్పుకోవడం తాను విన్న పెద్ద జోక్ అన్నారు. చేవేళ్ల నియోజకవర్గం షాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రైతు దీక్షలో కేటీఆర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకు ఎకరానికి రూ.17,500 రేవంత్ బాకీ ఉన్నారన్నారు. తెలంగాణలో ప్రతీ ఒక్కర్ని మోసం చేసిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పై ప్రజలు చీటింగ్ కేసులు పెట్టాలన్నారు. కాంగ్రెస్ అబద్దపు హామీలని నమ్మి ఓట్లేసిన ప్రజలు ఇప్పుడు రేవంత్ రెడ్డిని ఇష్టంవచ్చినట్టు తిడుతున్నారని చెప్పారు. తాను ముఖ్యమంత్రి కాగానే రూ.2 లక్షల రుణమాఫీ ఫైల్‌పై సంతకం పెడ్తా అన్న రేవంత్ రెడ్డి, తన సొంతూరు కొండారెడ్డి పల్లెలో అయినా, కొడంగల్ నియోజకవర్గంలో అయినా వందకు వంద శాతం రుణమాఫీ అయినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో ఛాలెంజ్ చేస్తే రేవంత్ సప్పుడు చేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు పైసలు పడితే, ఇప్పుడు ఓట్లప్పుడు మాత్రమే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పైసలు ఇస్తుందన్నారు. రైతుబంధు రూ.పది వేలు కాదు పదిహేను వేలు ఇస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, ఈ నెల 26 నుంచి రూ.12 వేలు కాకుండా రూ.15 వేలు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 22 లక్షల మంది కౌలు రైతులకు రైతు బంధు ఇవ్వకుంటే వదిలిపెట్టే ప్రస్తకే లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లా పట్టుకొని అడగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోటి 60 లక్షల మంది ఆడబిడ్డలకు ... నెలకు రూ.2,000 చొప్పున ఒక ఏడాదిలో రూ.30 వేలు, పెళ్లిళ్లు చేసుకున్న ఐదు లక్షల మంది ఆడబిడ్డలకు తులం బంగారం అంటే దాదాపు రూ.70 వేలు రేవంత్ బాకీ ఉన్నాడని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. ప్రతి హామీ నెరవేర్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చినట్టు దిల్లీలో రేవంత్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. చేవెళ్లలో త్వరలో ఉప ఎన్నిక వస్తుందని, పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ ఎన్నికలు జరుగుతాయన్నారు. షాబాద్ రైతు దీక్ష ఆరంభం మాత్రమే అని, ఈ నెల 21న నల్లగొండలో రైతు ధర్నా... ఆ తర్వాత అన్ని జిల్లాల్లోనూ రైతు దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎన్ని కేసులు పెట్టినా జైలుకు పంపినా రైతుల పక్షాన కొట్లాడుతూనే ఉంటామని తేల్చి చెప్పారు.

ఉక్రెయిన్ యుద్ధంలో
16 మంది భారతీయుల అదృశ్యం

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధంలో రష్యా తరఫున పోరాడుతున్న 16 మంది భారతీయులు కనిపించకుండా పోయినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇప్పటివరకు 12 మంది మృతిచెందినట్లు తెలిపారు. 'రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో మాస్కో తరఫున 126 మంది భారతీయులు పాల్గొన్నట్లు సమాచారం ఉంది. అందులో 96 మంది సైన్యం నుంచి బయటకు వచ్చారు. కొందరు స్వదేశానికి తిరిగివచ్చారు. మరికొందరు రష్యా దళాలతో పనిచేయడం లేదు. 18 మంది ఇంకా సైన్యంలోనే పనిచేస్తున్నారు. వారిలో 16 మంది ఆచూకీ లేదు. రష్యా వారిని మిస్సింగ్ కేటగిరీలో చేర్చింది.

ఇప్పటివరకు యుద్ధంలో పోరాడుతూ 12 మంది మరణించారు' అని జైస్వాల్ వెల్లడించారు. మిగిలిన వారిని త్వరగా స్వదేశానికి రప్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'రష్యా తరఫున యుద్ధంలో పాల్గొంటూ కేరళ వాసి టీబీ బినిల్ మృతి చెందిన సంగతి తెలిసిందే. అతడి సమీప బంధువుకు గాయాలయ్యాయి. దీనిని విదేశాంగ శాఖ తీవ్రంగా పరిగణించింది. ఈ విషయాన్ని మాస్కోలోని రష్యన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దిల్లీలోని రష్యన్ రాయబార కార్యాలయం అధికారులతోనూ మాట్లాడాం. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా మిగిలిన భారతీయులను అక్కడి నుంచి పంపించాలని డిమాండ్ చేశాం' అని ఇటీవల భారత్ ఓ ప్రకటన విడుదల చేసింది. తాజాగా ఈ మృతి ఘటనపై స్పందిస్తూ అతడి మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు రష్యా అధికారులతో మాట్లాడుతున్నామని జైస్వాల్ తెలిపారు.

కనీస వేతనం రూ.51,480

8వ వేతన సంఘం ఏర్పాటుపై నిపుణుల అంచనా

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్న నిర్ణయంతో 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 65 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. దీనివల్ల ఉద్యోగుల మూల జీతం 20 శాతం నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వేతన సంఘం అమలులోకి వస్తే ప్రయోజనాలపై ఆఫీస్ బ్రదర్‌హుడ్ మాజీ అధ్యక్షుడు హరిశ్చంద్ర తివారీ మాట్లాడుతూ లెవల్ 6 నుంచి 12 వరకు గల ఉద్యోగుల ప్రాథమిక జీతం దాదాపు 20 శాతం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ పెరుగుదలతో పాటు వారి ఇంటి అద్దె భత్యం, రవాణా భత్యం పెరుగుతాయి. మరోవైపు లెవల్ 1 నుంచి 5 వర్గం ఉద్యోగులకు మూల వేతనంలో దాదాపు 25 శాతం పెరుగుదల ఉండబోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ కేటగిరీ ఉద్యోగులకు కూడా రవాణా భత్యం పెరుగుతుంది. కేంద్రం నిర్ణయం 50 లక్షల మంది కేంద్ర ఉద్యోగులు, రక్షణ సిబ్బందికి ప్రయోజనం చేకూరుస్తుంది. 65 లక్షల మంది పెన్షనర్లు తమ పెన్షన్, ఇతర ప్రయోజనాలలో పెరుగుదలను అందుకుంటారు. ఈ మార్పులు పెరుగుతున్న ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. అందువల్ల ఈ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. గత వేతన సంఘం జనవరి 2016న కనీస ప్రాథమిక జీతాన్ని రూ.7 వేల నుంచి రూ.18 వేలకు పెంచింది. ఈసారి 8వ వేతన సంఘం నిర్ణయంతో కనీస జీతం 186 శాతం పెరిగి రూ.51,480కి చేరుకునే అవకాశం ఉందని కింగ్ స్టబ్- కాసివా న్యాయ సంస్థ భాగస్వామి రోహితశ్వ సిన్హా చెప్పారు. పనితీరు ఆధారిత జీతాల పెంపుపైనా చర్చలు జరుగుతున్నాయి. ఇది ఉద్యోగులు తమ పనితీరు ఆధారంగా అదనపు ప్రయోజనాలు పొందే అవకాశాన్ని కలిగిస్తుంది. మెరుగైన పనితీరు కనబరిచే ఉద్యోగులు ఈ జీతాల పెంపుతో మంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నలుగురి బలి

- బస్‌ను ఢీకొట్టిన టిప్పర్
- 13 మందికి తీవ్రగాయాలు...
- కొందరి పరిస్థితి విషమం



విశాలాంధ్ర-చిత్తూరు: ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఓ టిప్పర్ ఢీకొనడంతో నలుగురు మృతి చెందగా 13 మంది తీవ్రంగా గాయపడిన ఘటన జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర శివారు గంగాసాగరం వద్ద చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. వివరాలివి. తిరుపతి నుంచి మధురైకి ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు వెళ్తోంది. మార్గమధ్యంలో గంగాసాగరం వద్ద టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో బస్సు బోల్తా పడి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వలనే ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. బస్సులో సుమారు 30 ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించారు. బస్సు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు క్రేన్ల సాయంతో బోల్తా పడిన బస్సును పక్కకు తొలగించారు. మృత దేహాలను వెలికి తీశారు. క్షతగాత్రులను హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన 13 మందిని మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్ సుమిత్ కుమార్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మృతులను తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారికి చెందిన జీవ (40), తంజావూరు జిల్లాకు చెందిన ప్రశాంత్, తిరుపతి ఎన్జీవో కాలనీకి చెందిన శ్రీధర్ (21), తిరుపతి సప్తగిరినగర్‌కు చెందిన పొన్ను చంద్రాలు (33)గా గుర్తించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో
ముగ్గురు నేత కార్మికుల దుర్మరణం



విశాలాంధ్ర-కోడుమూరు: కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చేనేత కార్మికులు దుర్మరణం చెందారు. కర్నూలు- కోడుమూరు రహదారిలోని ప్యాలకుర్తి గ్రామ స్టేజి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఐచర్ వాహనం, కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు చేనేత కార్మికులు మృతి చెందారు. మృతులను కోడుమూరు పట్టణానికి చెందిన మాదుగుండు సోమశేఖర్ (55), బండ శ్రీనివాసులు (48), సాయె శ్రీనివాసులు (32)గా గుర్తించారు. సోమశేఖర్ శుక్రవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం తన హుండాయ్-ఐ-10 కారులో కర్నూలులోని హాస్పిటల్‌కు వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం బ్యాంకు పనులు ముగించుకొని కోడుమూరుకు తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గమధ్యలో కోడుమూరుకు సమీపంలోని ప్యాలకుర్తి స్టేజి సమీపంలో కారు ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును దాటి వెళ్లేందుకు ప్రయత్నించగా... కర్నూలు వైపుకు ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం, కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న బండా శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా, సోమశేఖర్, శ్రీనివాసులు తీవ్ర గాయపడి...అపస్మారక స్థితిలో కింద పడ్డారు. ప్రమాదంలో ఐచర్ వాహనం, కారు నుజ్జునుజ్జు అయ్యాయి. కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని... స్థానికులతో కలిసి కారు ముందు భాగంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రులు శ్రీనివాసులు, సోమశేఖర్‌లను 108 వాహనంలో కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే వారిద్దరూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు, బంధువులు, పట్టణంలోని చేనేత కార్మికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలివచ్చారు. మృతుల్లో ఎం.సోమశేఖర్ చేనేత గద్వాల పట్టు చీరల మాస్టర్ వీవర్‌గా వ్యాపారం చేస్తుండగా...బండ శ్రీనివాసులు, సాయె శ్రీనివాసులు కార్మికులుగా తమ కుటుంబాలను పోషించు కుంటున్నారు. రోడ్డు ప్రమాదంపై కోడుమూరు సీఐ ఎండీ తబ్రేజ్ కేసు నమోదు చేసి... దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడులకు ప్రాధాన్యతా కేంద్రంగా ఏపీ

ప్రభుత్వంతో పీపుల్ టెక్' ఎంవోయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: భారతదేశ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో కీలకమైన అభివృద్ధిగా, పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ... కర్నూలు జిల్లాలో 1,200 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వాహన పార్క్, ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ స్థాపించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రైవేట్ ఈవీ పార్క్ దేశంలో ఈవీ పూర్ణ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేయడానికి ప్రథమ కేంద్రంగా నిలవనుంది. ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ మొత్తం రూ.1,800 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేయబడుతుంది. పూర్తిస్థాయిలో వృద్ధిలోకి వచ్చిన తరువాత ఈ పార్క్ 1.5 బిలియన్ డాలర్ల (7,13,000 కోట్లు) పెట్టుబడిని ఆకర్షించడమే కాకుండా 25,000 ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తుంది. పార్క్ యాంకర్ యూనిటీగా, పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ రూ. 300 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ టూ-వీలర్ (ఈ 2 డబ్ల్యు) తయారీ యూనిట్‌ను స్థాపించనుంది. ఈ పార్క్ ఈవీ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తుంది. అవగాహన ఒప్పందంపై పీపుల్ టెక్ గ్రూప్ టీజీ విశ్వప్రసాద్, ఆంధ్ర ప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ సీఈవో సాయికాంత్ వర్మ సంతకాలు చేశారు. మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, పీపుల్ టెక్ గ్రూప్ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనలను ఆచరణలో పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను నూతన పెట్టుబడులకు ప్రాధాన్యతా కేంద్రంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ ఆంధ్రప్రదేశ్ వినూత్న, స్థిరత్వంలో అగ్రగామిగా నిలవడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇది ఎలక్ట్రిక్ వాహనాల కోసం సమర్థవంతమైన ఎకోసిస్టమ్ రూపొందించడంలో పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు.

రేపు అమిత్‌షా పర్యటనకు నిరసనలు

వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఉద్దేశించి రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన వ్యతిరేకిస్తూ ఈనెల 19న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వై.సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నాయకుడు కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు ఎన్.మూర్తి, ఫార్వర్డ్ బ్లాక్ నేత పీవీ సుందర రామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకుడు జానకీ రాములు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ, అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందనీ, అదేదో దేవుడిని తలుచుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందన్న అమిత్ షా అనుచిత వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా ప్రధాని మోదీ చలించలేదని, బీజేపీ వైఖరిలో మార్పులేదని దుయ్యబట్టారు. అన్ని వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు బీజేపీ, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని, ఈ నిరసన కార్యక్రమానికి మద్దతునిచ్చి పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రజలకు వామపక్ష పార్టీల నేతలు విజ్ఞప్తి చేశారు.

భార్యను చంపిన కిరాతకుడు

విశాలాంధ్ర-తాడిపత్రి: మనస్పర్థల కారణంగా పుట్టింటికి వెళ్లిన భార్యను నమ్మకంగా పిలి పించి హత్యచేసి పరారైన హృదయ విదారకమైన ఘటన అనంత పురం జిల్లా తాడిపత్రిలో జరిగింది. వివరాలివి. పుట్లూరు మండలం వెంగన్న పల్లి గ్రామానికి చెందిన వేంకటేశ్వర రెడ్డి, పుష్పవతి (35) భార్యాభర్తలు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో అతడి భార్య ... నాలుగు నెలలుగా పుట్టినిల్లు అయిన బందర్లపల్లిలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఆస్తిని కొడుకుల పేరు మీద రాస్తానని, ఆ విషయం మాట్లాడుకుందాం అంటూ భార్యను నమ్మించాడు వెంకటేశ్వరరెడ్డి. భార్య పుష్పవతి, అత్తమామలు, కొందరు ఊరి పెద్ద మనుషులతో కలిసి తాడిపత్రిలోని ఓ గెస్ట్ హౌస్‌లో సమావేశం అయ్యారు. నీతో మాట్లాడాలి రా అంటూ వేంకటేశ్వరరెడ్డి భార్యను గది నుంచి బయటకు పిలిచాడు. పథకం ప్రకారం ముందుగానే ఏర్పాటు చేసుకున్న వేట కొడవలితో ఆమెను నరికి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు లాడ్జి వద్దకు వచ్చి కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని సీఐ సాయి ప్రసాద్ తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఒకరి హత్య

విశాలాంధ్ర- చింతూరు: చత్తీస్‌గఢ్‌లో పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో ఓ యువకుడిని మావోయిస్టులు చంపేశారు. మిర్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల హల్లూరు గ్రామంలో సుక్కు హక్కు అనే వ్యక్తిని భైరంగఢ్ ఏరియాకమిటీ మావోయిస్టులు గురువారం తొలుత కిడ్నాప్ చేసి... శుక్రవారం గొంతు కోసి హత్య చేశారు. ఈ హత్యతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జీఎస్డీపీపై చంద్రబాబు అబద్ధాలు

మాజీ మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో జీఎస్డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్- స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి) గణనీయంగా పెరిగిందని సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలను ప్రచారం చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి కాకాణి గోవర్థన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో జరిగిన ప్రగతిని దాచిపెట్టి, తన హయంలోనే పెద్ద ఎత్తున అన్ని రంగాల్లో వృద్ధి సాధించినట్లు గోబెల్స్‌ను మించి ప్రచారం చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఆర్థిక రంగంపైనా, పాలనా వ్యవహారాలపైన కొంచెం అవగాహన ఉన్న వారు ఎవరైనా సరే చంద్రబాబు చెబుతున్నవి అవాస్తవాలని ఘంటాపథంగా చెప్పగలరని స్పష్టం చేశారు. సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధించిన ప్రగతి గురించి మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారని, దీనికి రుజువుగా స్వయంగా ఆయనే కొన్ని గణాంకాలను కూడా ప్రకటించారని తెలిపారు. తనకు వంతపాడే మీడియాలో తానే ఈ దేశంలో అతిపెద్ద విజనరీని అని చాటుకునేందుకు ప్రయత్నించారన్నారు. వైసీపీ హయాంలో దారితప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్న ఆర్థిక వేత్తగా తనను తాను అభివర్ణించుకున్నారని, తన వాదనకు అనుగుణంగా గణాంకాలను మార్చి, ప్రజలను ఏమార్చే ప్రయత్నించారని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీలో బ్రహ్మాండంగా వృద్ధి సాధించినట్లు చంద్రబాబు ప్రకటించుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాల్లో వృద్ధి సాధించినప్పుడే జీఎస్డీపీ పెరుగుతుందని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.